ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 10 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.4



విద్యుత్ దీపాల అలంకరణలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట నృసింహుడి ఆలయం

తిరువేంకటాదీశ.. నారసింహ

వైభవంగా జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సంప్రోక్షణ అనంతరం స్వస్తివాచనంతో వేడుకలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. తొలుత విష్వక్సేనారాధన అనంతరం పుణ్యాహవాచనం నిర్వహించారు. గర్భాలయానికి అభిముఖంగా లక్ష కుంకుమార్చన చేపట్టిన అర్చకులు స్వామివారిని తిరువేంకటపతిగా దివ్యమనోహరంగా అలంకరించి వేద పారాయణంతో తిరువీధి సేవ నిర్వహించారు. సాయంత్రం మృత్స్యంగ్రహణం నిర్వహించగా ఉత్తర తిరువీధిలోని ఏర్పాటుచేసిన యాగశాలలో అంకురారోపణ చేసి హవనం నిర్వహించారు. • 6లో



ముద్దుగుమ్మల కోసం
ముస్తాబు

- యాదగిరిగుట్ట, పోచంపల్లిలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఈ నెల 15న రానున్న మిస్‌వరల్డ్ పోటీదారులు



పోచంపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం మిస్‌వరల్డ్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి సుందరీమణులు తరలిరానున్నారు. శనివారం నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. అయితే ప్రభుత్వం తెలంగాణలోని సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని, చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి చూపించాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మిస్ వరల్డ్ పోటీదారులు ఈ నెల 15న యాదాద్రి జిల్లాలో పర్యటించేందుకు టూరిజం శాఖ సన్నాహాలు చేసింది. ఈమేరకు ప్రపంచ అందగత్తెలు రాష్ట్రంలోని ఏఏ ప్రాంతాలను సందర్శించాలన్న కార్యక్రమాల వివరాలను అధికారికంగా నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న వారు సందర్శించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతతోపాటు ప్రొటోకాల్‌పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు కార్యక్రమ నిర్వహణపై నేరుగా సమీక్షలు నిర్వహిస్తూ, ఏర్పాట్లపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర పర్యాటక శాఖ...

- మిగతా 7వ పేజీలో...



గ్రామాధికారులు
వస్తున్నారు

భూభారతి చట్టం జూన్ 2 నుంచి అమలులోనికి రానుండగా, అదే రోజు నుంచే భూ సంస్కరణల అమలుకు రెవెన్యూశాఖ రంగం సిద్ధం చేసింది. ప్రధానంగా ప్రతి రెవెన్యూగ్రామానికి ఒక గ్రామపాలనాధికారితో పాటు, మరో లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను నియమించనుంది. సుమారు పదేళ్లుగా భూ పట్టాల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించనుంది. అంతేకాక సాదాబైనామాలు, ఇతర భూవివాదాలను పరిష్కరించనుంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ప్రతీ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి, సర్వేయర్
- భూవివాదాల పరిష్కారమే లక్ష్యంగా 'భూభారతి'
- జూన్ 2నుంచి కొత్తచట్టం అమలు
- ప్రతీ గ్రామంలో సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారం
- సాదాబైనామాలు పరిష్కరించే దిశగా..
- సమగ్ర భూసర్వే చేయాలనే డిమాండ్లు

భూ వివాదాల పరిష్కారానికి ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని తహసీల్దార్ నేతృత్వంలోని బృందం సందర్శించనుందని, దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 8న నల్లగొండ జిల్లా పర్యటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 9,26,000 సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని,అర్హులైనవారికి పట్టాలు సైతం ఇస్తామని మంత్రి ప్రకటించడంతో సాదాబైనామాల దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూమిమోఖాపై ఉన్న ప్రతీ రైతుకు,న్యాయబద్ధంగా ఉంటే పట్టా ఇస్తామని తేల్చిచెబుతుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పాలనాధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్

గత ప్రభుత్వం ధరణిని అమలులోకి తేవడంతోపాటు, వీఆర్వో వ్యవస్థను పూర్తిగా తొలగించింది. దీంతో గ్రామాల్లో రెవెన్యూ పాలనా వ్యవస్థ లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టింది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునఃప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక విలేజ్ లెవల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (పూర్వపు వీఆర్వో స్థాయి), మరో లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను నియమించాలని నిర్ణయించింది. వీఎల్‌వోల కోసం పూర్వపు వీఆర్‌వోలు, అర్హత కలిగిన వీఆర్‌ఏలను దరఖాస్తు చేసుకోవాలని సూచించి, వారికి అవకాశం కల్పించగా, లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ప్రైవేట్ సర్వేయర్లకు, సర్వే శిక్షణ పొందిన యువతకు అవకాశం కల్పిస్తోంది. వీరందరికీ శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగించనుంది. సర్వేయర్ల కొరతతో ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో భూముల వివాదాలు నెలకొన్నాయి. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక సర్వేయర్‌ను నియమిస్తే సర్వేల సమస్యలు పరిష్కారమవుతుందనే నమ్మకంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వీఎల్‌ఏలు, సర్వేయర్లు జూన్ 2నుంచి విధుల్లోకి రానున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,372 రెవెన్యూ గ్రామాల్లో ప్రతీ గ్రామానికి ఒక వీఎల్‌వో, మరో సర్వేయర్ నియామకం కానున్నారు.

జూన్ 2 తర్వాత రెవెన్యూ సదస్సులు

భూభారతి చట్టం అధికారికంగా జూన్ 2వ తేదీ నుంచి అమల్లోకి రానుండటంతో, అదే రోజు నుంచి ప్రతీ రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. తహసీల్దార్ నేతృత్వంలోని రెవెన్యూ బృందాలు ప్రతీ రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకొని పరిష్కరిస్తారు. భూభారతితో దాదాపు 80శాతం సమస్యలు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారమవుతుండగా, మరో 10శాతం ఆర్డీవో, ఇంకో 10శాతం కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యే అవకాశముందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో భూ సమస్యలున్నవారంతా గ్రామాల్లో జరిగే సదస్సుల్లో సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరుతున్నారు. ఈ సదస్సులను తొలుత పైలెట్ మండలాల్లో, ఆతర్వాత భూ సమస్యలు ఎక్కువగా

మిగతా 7వ పేజీలో...

భూమల రీసర్వే చేయాల్సిందేనని డిమాండ్లు

గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్న సందర్భంలో ప్రభుత్వం పాత అనుభవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సమగ్ర భూసర్వే నిర్వహించాలనే సూచనలు వస్తున్నాయి. భూసర్వేతో పాటు కొత్త నక్షాలు, కొత్త రెవెన్యూ రికార్డులు రాయాలనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్ సర్వేయర్లు కాకుండా తిరుమలగిరి (సాగర్) తరహా ప్రభుత్వ సర్వేయర్లతో సమగ్రంగా భూముల సర్వే నిర్వహించి భూధార్ నెంబర్ లేక సర్వేనెంబర్లు కేటాయించాలని కోరుతున్నారు. అదేవిధంగా కొత్త గ్రామ నక్షాలు, కొత్త రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ భూములకు కంచెలు వేయాలని, ప్రభుత్వ ఆస్తులైన దేవాదాయ, వక్ఫ్, రిజర్వ్‌ఫారెస్ట్ భూములకు, చెరువులు, కుంటలు, గ్రామ కంఠం భూములు, శ్మశానవాటికలకు హద్దులు నిర్ణయించాలని కోరుతున్నారు. ప్రతీ పంచాయతీని ఒకరెవెన్యూ గ్రామంగా గుర్తించి రికార్డులు, నక్షాలు రూపొందించాలనే అభిప్రాయాలు వస్తున్నాయి.

అణగారినవర్గాల హక్కుల పతాక భీంరెడ్డి



రామచంద్రాపురం వైజంక్షన్ వద్ద బీఎన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యు) నాయకులు

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మట్టయ్య

మిర్యాలగూడ, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట గెరిల్లా సేనాని, సామాజిక ఉద్యమకారుడు, అణగారినవర్గాల హక్కుల పతాక భీంరెడ్డి నర్సింహారెడ్డి అని ఎంసీపీఐ(యు)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. శుక్రవారం రాంచంద్రాపురం వైజంక్షన్ వద్ద మాజీ ఎంపీ, ఎంసీపీఐ(యు) పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు బీఎన్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. తెలంగాణ పల్లెల్లో నాడు ప్రజలపై దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాములు అమలు చేస్తున్న తీవ్ర నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ భూమి, భుక్తి, విముక్తి నినాదంతో రైతులను ఉద్యమంలో సమీకరించి, గెరిల్లా పోరాటానికి బీఎన్‌రెడ్డి నాయకత్వం వహించారన్నారు. నిర్బంధం ఎంత పెరిగినా, వెనుదిరిగి చూడక రహస్య ఉద్యమంలో మరింతగా రాటుదేలారని అన్నారు. నైజాం రజాకార్ల సేనలను, పెత్తందార్లను గెరిల్లా దాడులతో గ్రామాల నుంచి తరిమేసి వెట్టిచాకిరీ నుంచి 300 గ్రామాలను విముక్తి చేశారన్నారు. భూమిలేని పేద రైతులకు 10లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని అన్నారు. స్వాతంత్రోద్యమం అనంతరం భారత ప్రజాస్వామిక ఎన్నికల్లో నిలబడి పార్లమెంట్ మెంబర్ గా గెలిచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో తన వాగ్ధాటిని వినిపించారని అన్నారు. మిర్యాలగూడ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో కేంద్రంతో కొట్లాడి బీబీనగర్-నడికుడి రైలుమార్గాన్ని ఏర్పాటు చేయించారని అన్నారు.

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెచ్చే సామాజిక ఉద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. దేశ జనాభా ప్రకారం బీసీలు 'మేమెంతో మాకంత వాటా' అని నినదించాలని పిలుపునిచ్చారు. ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేసి వామపక్ష రాజకీయ పార్టీల ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి, భరత్, లాలునాయక్, మల్లేష్, రవీందర్, మౌనిక, ఉప్పలమ్మ, గురవయ్య, కమలమ్మ, సైదానాయక్, జ్యోతి, యాదమ్మ, శారద, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత లేకుండా
చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరత లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ, సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీచేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రంలో రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు అనంతరం లారీలు, బస్తాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ దేవ్‌సింగ్,సింగిల్‌విండో చైర్మన్ గట్టుప్పల్లి నర్సిరెడ్డి ఉన్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు సన్నద్ధం కావాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

హాలియా, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 20న సమ్మె నిర్వహించేందుకు కార్మికవర్గం సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన పాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం హాలియాలో నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్ నాగార్జునసాగర్ నియోజకవర్గ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాస్తూ, కార్మికులను శ్రమ దోపిడీ చేస్తూ కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని విమర్శించారు. మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పిన హామీని నెరవేర్చలేదన్నారు. 11 ఏళ్ల పాలనా కాలంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్విస్ బ్యాంకులో ఉన్న అక్రమ సంపదనంతా వెలికి తీసి ప్రజలకు పంచుతానని చెప్పిన మోదీ బడా పెట్టుబడిదారుల జేబులు నింపే విధంగా కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. సమ్మెలో కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అన్వర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, నాయకులు ఎస్‌కె.బషీర్, చాంద్‌పాషా, రెబెల్లి వెంకటేశ్వర్లు, మేకల ఆంజనేయులు, ఎస్‌కె.సయ్యద్, హుస్సేన్, పాదిల వెంకన్న, చిరంజీవి, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24, 25న నిర్వహించే విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో టీఆర్‌జీఎస్ శిక్షణ తరగతుల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన తండాలను రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేసి సబ్‌ప్లాన్ నిధులను తండాలకే ఖర్చు చేయాలన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అటవీ భూములపై గిరిజనులకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించి, అటవీ ఉత్పత్తుల్లో గిరిజనులను భాగస్వామ్యం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలను రాజకీయ చైతన్యం దిశగా సమాయత్తం చేసేందుకు శిక్షణ తరగతులు హాలియా పట్టణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామావత్ నరేష్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత అశోక్‌నాయక్, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లాలూనాయక్,రమావత్ రమేష్‌నాయక్, నేనావత్ మునినాయక్, రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో థర్మల్ యూనిట్-1 ప్రారంభం

ట్రయల్ రన్ చేస్తున్న క్రమంలో ఆయిల్ పైపులైన్ లీకై విద్యుత్ కేబుల్ నెట్‌వర్క్ దగ్ధం సరిచేసిన అధికారులు ● ఈ నెల చివరి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు • 7లో

రసాయనాల ఎరువుల వాడకం తగ్గించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీరమ్య

హాలియా, మే 9 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో దిగుబడి కోసం రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, పోషకాలతో కూడిన ఎరువులను వినియోగించాలని వ్యవసాయ పరిశోధనా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరమ్య, స్వాతి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాయుడుపాలెం గ్రామంలో కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పైరు ఎదుగుదలకు అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని, తద్వారా పెట్టుబడి తగ్గుతుందన్నారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించి భూమి తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంట మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని, సాగు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సరిత, రైతులు సర్దార్, చిరంజీవి, మోతీలాల్, లక్ష్మణ్, మల్లికార్జున్‌రావు, అప్పారావు, మంద సైదులు రావుగౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత చికిత్సతో ఉపశమనం

ఆంధ్రజ్యోతి జన వాక్యం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి కోసం కేంద్ర ప్రభుత్వం నగదు రహిత చికిత్స పథకాన్ని తీసుకువచ్చింది. చాలా ప్రమాదాల్లో గోల్డెన్ అవర్(ప్రమాదం జరిగిన మొదటి గంట సమయం)లోనే చికిత్స అందక మృత్యువాత పడుతున్నారు. ఈ క్రమంలో సకాలంలో క్షతగాత్రులకు ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ.లక్షన్నర వరకు చికిత్స అందించేలా కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం క్షతగాత్రులకు ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని, పేదలకు మరింత ధైర్యాన్ని ఇస్తుందని స్థానికులు అంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

ఎంతో ఉపశమనం లభిస్తుంది



గాయపడిన వారికి, కుటుంబసభ్యులకు ఈ పథకంతో ఎంతో ఉపశమనం లభిస్తుంది. రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించడం అభినందనీయం. అదేవిధంగా నిర్ధిష్ట ఆసుపత్రిలో ఏడు రోజుల వరకు సమయం సరికాదు. అన్ని ఆసుపత్రుల్లో 10 రోజుల వరకు సమయం పెంచాలి. అధికారులు ఆసుపత్రులు సమన్వయంతో పథకాన్ని అమలు చేయాలి.

ఎర్ర అఖిల్‌కుమార్, విద్యార్థి, సూర్యాపేట

మాలాంటి వాళ్లకు మేలు



ప్రతిరోజూ కూలి పనికి వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాం. వాహనాల్లో వెళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. కొంతమందికి తీవ్ర గాయాలవుతాయి. ఇలాంటి ఉచిత వైద్యంతో మాలాంటి వాళ్లకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో వాహనాల్లో కూలికి వెళుతూ ప్రమాదాలకు గురై ఆర్థికఇబ్బంది పడిన వారు ఉన్నారు. మాలాంటి వాళ్లకు ఈ పథకంతో మేలు జరుగుతుంది.

చంద్రయ్య, కూలీ, సూర్యాపేట

ప్రమాద బాధితులు సామాన్యులే



ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ఎక్కువగా రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. వీరంతా దాదాపుగా సామాన్య ప్రజలే ఉంటారు. చికిత్స కోసం ఆర్థికంగా కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకంతో గరిష్టంగా రూ. 1.50లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించడం హర్షణీయం. అదేవిధంగా హైవేలపై మద్యం విక్రయాలు జరగకుండా చూడాలి. ఆదాయ వనరుల పేరుతో మద్యం విక్రయాలు సరికాదు.

ఆవుల నాగరాజు, విద్యార్థి సంఘ నాయకుడు, సూర్యాపేట

అన్ని ఆసుపత్రుల్లో వర్తింపజేయాలి



నగదు రహిత చికిత్స పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన ఆసుపత్రుల్లో కాకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వర్తింపజేయాలి. ఈ పథకం అమలు చేయడానికి వీలుగా రాష్ట్ర పోలీసులు, ఆసుపత్రులు, రాష్ట్ర ఆరోగ్య సంస్థ సమన్వయంతో కలిసి పనిచేయాలి.

కారింగుల వెంకన్న, రైస్‌మిల్ నిర్వాహకుడు, సూర్యాపేట

తిరువేంకటాదీశ.. నారసింహ

యాదగిరిగుట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రధానాలయంతో పాటు పాతగుట్ట ఆలయంలో శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రాలు, సన్నాయి మేళాలతో ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు బృందం ఆలయంతో పాటు పరిసరాలను సంప్రోక్షణ చేశారు. స్వస్తివాచనంతో వేడుకలకు శ్రీకారం చుట్టి తొలుత విష్వక్సేనారాధన చేసి పుణ్యహవాచనం చేశారు. గర్భాలయానికి అభిముఖంగా లక్ష కుంకుమార్చన చేపట్టిన అర్చకులు స్వామివారిని తిరువేంకటపతిగా దివ్యమనోహరంగా అలంకరించి వేద మంత్రాలతో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారికి జరిగిన ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ డైరెక్టర్, ఈవో ఎస్ వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు పాల్గొన్నారు. పాకిస్థాన్ దేశంలో భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం కావాలని ఆకాంక్షిస్తూ భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ప్రత్యేక సంకల్పన చేశారు. సాయంత్రం



ఉత్సవాల విశిష్టతను వివరిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహచార్యులు, పాల్గొన్న ఈవో వెంకట్రావు, ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు

వైభవంగా జయంత్యుత్సవాలు



తిరువీధిలో అలంకార సేవ

మృత్యంగ్రహణం నిర్వహించగా ఉత్తర తిరువీధిలోని ఏర్పాటుచేసిన యాగశాలలో అంకురారోపణ చేసి హవనం నిర్వహించారు. స్వామివారిని పరవాసుదేవుడిగా అలంకరణలో వేద పండితుల వేద పారాయణాలతో గరుడ వాహనంపై ఊరేగించారు.



ఉత్సవమూర్తులకు కుంకుమార్చన నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు

అనుబంధ ఆలయమైన శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో చండీ హోమం చేపట్టిన పూజారులు ప్రత్యేక సంకల్పంతో హవనం చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట ఆలయంలో ఉదయం స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, లక్ష కుంకుమార్చనలు నిర్వహించగా సాయంత్రం మృత్యంగ్రహణం, అంకురారోహణ, హవనం వైభవంగా కొనసాగాయి.

కార్యక్రమాల్లో ఉప కార్యనిర్వహణధికారి దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, రామరావునాయక్, మాచర్ల రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, దాసోజు నరేష్, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రధానాలయంలో జయంత్యుత్సవాలు

నేటి కార్యక్రమాలు

- ఉదయం 8.45 గంటలకు నిత్య నృసింహ మూలమంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన, కాళీయ మర్ధన అలంకార సేవ.
- సాయంత్రం 6 గంటలకు నృసింహ మూలమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి, శ్రీ రామ అలంకారంలో హనుమంత వాహనసేవ.

ఆదివారం(11న)

- ఉదయం 7గంటలకు నృరసింహ మూల మంత్ర హవనాలు, 8.30 నుంచి 9 గంటల వరకు, మహాపూర్ణాహుతి, తదుపరి సహస్ర కలశాభిషేకం.
- సాయంత్రం 7 గంటలకు విశేష తిరువారాధన, అర్చన, వేదస్వస్తి, నృరసింహ ఆవిర్భావం, మహానివేదన,తీర్థప్రసాద గోష్ఠి, ఉత్సవ పరిసమాప్తి.

పాతగుట్ట ఆలయంలో

నేటి కార్యక్రమాలు

- శనివారం ఉదయం నిత్య నృసింహ మూలమంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన
- సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి

ఆదివారం(11న)

- నృసింహ మూల మంత్ర హవనాలు, మహాపూర్ణాహుతి, అష్టోత్తర శతఘటాభిషేకం
- సాయంత్రం నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, ఉత్సవ పరిసమాప్తి.

● ఆకట్టుకుంటున్న సంగీత సభలు

స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ధార్మిక సాహిత్య సంగీత సభలు కొనసాగాయి. ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు జై శ్రీరాం భక్త భజన మండలి (యాదగిరిగుట్ట), 6.45 నుంచి 7.30 గంటల వరకు గాయత్రి మహిళ భజన మండలి (యాదగిరిగుట్ట), 7.30 నుంచి 8.15 గంటల వరకు శ్రీ పుండరిక భక్త సేవ సమాజం (భూదాన్‌పోచంపల్లి) భజనలు, 8.15 నుంచి 9 గంటల వరకు సత్య మ్యూజిక్ అకాడమీ (హైదరాబాద్) భక్తి సంగీతం, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వర లయ అకాడమీ(సౌజన్యరాజన్, హైదరాబాద్), 6 నుంచి 7.15 గంటల వరకు శ్రీ తాండవ నృత్య, డాన్స్ మ్యూజిక్ అకాడమీ(మోహన్‌దాస్, హైదరాబాద్), 7.15 నుంచి 8 గంటల వరకు గౌరీభట్ల సాత్విక (యాదగిరిగుట్ట) కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులు ఆకట్టుకున్నాయి.





మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీపాలతో అలంకరించిన గర్భాలయం, కొండపైకి వెళ్లే ముఖద్వారం

మట్టపల్లిలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

మఠంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అధ్యయనోత్సవాలు శనివారం కొనసాగాయి. మూడో రోజు మూలవర్లకు అర్చనలు, అభిషేకాలు పూర్తయ్యాక స్వామి వారి పరమభక్తులైన నమ్మాళ్వారులకు తిరుమంజనం చేపట్టారు. పట్టువస్త్రాలు, తులసీమాలలతో అలంకరించి భద్రపీఠంపై అధిష్ఠింపజేసి పరమపదోత్సవం నిర్వహించారు. ఆళ్వారుల పునరావతార అంశాలను వివరించారు. రాత్రి వేళ ఆళ్వారులు సహా ఉత్సవమూర్తులను గరుడవాహనంపై అధిష్ఠింపజేసి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామిసేవలో ఆద్యంతం నృసింహనామ స్మరణతో భక్తులు పరవశించారు.. ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అధికారులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పరమపదోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం రాత్రి(సోమవారం తెల్లవారుజామున) నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. శుక్రవారం క్షేత్రంలో పార్కింగ్, కల్యాణమండపం, క్యూలైన్లు, వీఐపీల పార్కింగ్ స్థలం, బస్సు, వాహనాల రాకపోకలపై అధికారులు, పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో కల్యాణోత్సవం జరిగేలా అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

● మట్టపల్లి ఆలయానికి రూ.2కోట్లు మంజూరు

మట్టపల్లి నృసింహ ఆలయ బ్రహ్మోత్సవాలను కన్నులపండువగా నిర్వహించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించినట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా నిధులతో మట్టపల్లి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం యాత్రిక సముదాయం(డార్మెంటరీ హాల్) వరాహ నిలయం, వసతి గదులు, భక్తులకు తాగునీరు కోసం ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, ప్రసాదాల తయారీ హాల్, అన్నదానం నిర్వహణ హాల్, దేవాలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణం, రాజగోపురం వద్ద పీపీజీఐ షెడ్ నిర్మాణం చేపడతామన్నారు. నిధులను మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అతివేగంతో దూసుకువచ్చిన కారు

ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి మృతి




ఇంటి ముందు ఆడుకుంటుండగా ఢీకొడుతున్న కారు, సౌమిక్(ఫైల్‌ఫొటో)

భువనగిరి టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా కారు దూసుకువచ్చి ఢీకొట్టడంతో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దర్గాయి వేణు-వర్షిత కుమారుడు సౌమిక్(4) గురువారం సాయంత్రం ఇంటి ముందు సైకిల్ తొక్కుతున్నాడు. అదే సమయంలో మండలంలోని ముత్తిరెడ్డిగూడెంకు చెందిన శ్రీను మద్యం మత్తులో కారును వేగంగా నడుపుకుంటూ వచ్చి సౌమిక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇరుక్కున్న సైకిల్‌తో సహా మిన్నును కారు మూడు మీటర్ల దూరం లాక్కెళ్లి వదిలేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చిన్నారిని జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాద దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డయ్యాయి. సౌమిక్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి డ్రైవర్ మృతి

ట్రాక్టర్‌తో పత్తికట్టె తొలగిస్తుండగా ఘటన



సరిగ్గా డ్రైవర్ సీటుపై పడిన స్తంభం, వెంకటేష్(ఫైల్‌ఫొటో)

మోత్కూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలో ట్రాక్టర్‌తో చెల్కలో పత్తి కట్టె తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం విరిగి పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే జిట్ట వెంకటేష్(28) గురువారం సాయంత్రం అతడి స్నేహితుడు ఎర్ర శ్రీను వద్ద ట్రాక్టర్ అడిగి తీసుకెళ్లాడు. ట్రాక్టర్‌కు పత్తి కట్టె తొలగించే బ్లేడు వేసి అతడి చెల్కలో పత్తి కట్టె తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో చెల్కగట్టుపైన ఉన్న విద్యుత్ స్తంభం స్టేవైర్ ట్రాక్టర్ బంపర్‌కు తట్టుకుని లాగినట్లయి విద్యుత్ స్తంభం విరిగి ట్రాక్టర్‌పై డ్రైవింగ్ చేస్తున్న వెంకటేష్‌పై పడింది. వెంకటేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించి, వెంకటేష్ సోదరుడు జిట్ట రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

రాజాపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నర్సాపూర్‌లోని కొనుగోలుకేంద్రంలో ధాన్యం చోరీ జరిగింది. రాజాపేటకు చెందిన ఎం.శ్రీహరి తన పొలంలో పండిన ధాన్యాన్ని నర్సాపూర్‌లో కొనుగోలు కేంద్రానికి రెండురోజుల క్రితం తరలించారు. అక్కడే నిల్వఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధాన్యాన్ని చోరీ చేశారు. శుక్రవారం ఉదయం శ్రీహరి వెళ్లే చూడగా సుమారు ఏడు క్వింటాళ్ల మేర ధాన్యం తక్కువగా ఉంది. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రాజాపేట పోలీసులకు రైతు శ్రీహరి ఫిర్యాదు చేశారు.

జీవాల కాపరులను మింగిన బావి

- బావిలో పడి ఇద్దరి మృతి
- స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా

హుజూర్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వలస కుటుంబాల్లో విషాదం నెలకొంది. నీటి కోసం వెళ్లిన ఇద్దరు బావిలో పడి గల్లంతయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆరు కుటుంబాలు గొర్రెలు మేపేందుకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతానికి వచ్చారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటకు చెందిన కన్నూర్ తిరుపతయ్య, మేధిపురం లక్ష్మణ్‌తో పాటు మరో ఆరుగురు గొర్రెలను మేపుకునేందుకు రెండు నెలల క్రితం హుజూర్‌నగర్ ప్రాంతానికి వచ్చారు. కాగా పట్టణంలోని జక్కుల లింగయ్య పొలంలో మేత కోసం గొర్రెలను నిలిపి అక్కడే పొలంలో చెట్ల కింద ఉంటున్నారు. వేసవి సెలవులు కావడంతో నాలుగు రోజుల క్రితం తిరుపతయ్య ఇద్దరు కుమారులు శేఖర్(14), చరణ్‌లు తండ్రి వద్దకు వచ్చారు. కాగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో తిరుపతయ్య పెద్దకుమారుడు శేఖర్, అదేవిధంగా మేధిపురం లక్ష్మణ్(21)లు పట్టణంలో తిరుపతమ్మ దేవాలయానికి సమీపంలోని జక్కుల లింగయ్య బావిలో నీళ్ల కోసం వెళ్లారు. లక్ష్మణ్ నీళ్లు పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా కాలుజారి పడి మునగబోతుండగా శేఖర్ అతడిని కాపాడేందుకు ప్రయత్నించారు.

ఆ క్రమంలో ఇద్దరు నీటిలో మునిగి చనిపోయినట్లు తండ్రి తిరుపతయ్య ఫిర్యాదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరి మృతదేహాలను రెస్క్యూ టీం సభ్యులు బయటికి తీశారు. అనంతరం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో సొంత గ్రామాలకు తీసుకువెళ్లారు.

● పులిచింతల బ్యాంక్ వాటర్‌లో పడి పశువుల కాపరి...

మేళ్లచెర్వు, మే 9 (ఆంధ్రజ్యోతి) : చింతలపాలెం సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు బ్యాంక్ వాటర్‌లో పడి పశువుల కాపరి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండలం తమ్మారం గ్రామానికి చెందిన సూరగాని పిచ్చయ్యకు చెందిన గేదెలు పులిచింతల బ్యాంక్ వాటర్ మధ్యలో ఉన్న పాయ(చిన్న ద్వీపం) మేతకు వెళ్లాయి. వాటిని తోడుకొచ్చేందుకు పిచ్చయ్య కుమారుడు అయోధ్య(19) పాయల మధ్యకు ప్రతి రోజూ చిన్నపడవతో వెళ్లి వస్తుంటారు. అయోధ్య గురువారం ఈతకొట్టుకుంటూ వెళ్లగా ప్రమాదశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రి స్థానిక మత్స్యకారులు మృతదేహాన్ని వెలికితీశారు. కాగా అయోధ్య తండ్రి పిచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా అయోధ్య పదో తరగతి వరకు చదివాడు. వ్యవసాయంలో తండ్రికి చేదోడు, వాదోడుగా ఉంటున్నాడు. యువకుడికి తల్లితో పాటు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.



అయోధ్య(ఫైల్‌ఫొటో)

పులిచింతల బ్యాంక్ వాటర్‌లో వరుస ప్రమాదాలు

పులిచింతల బ్యాంక్ వాటర్‌లో వరుస ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు సమన్వయం లోపంతో ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గురువారం అయోధ్య మరణించగా వారం కిందట చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి కొమ్ము లోకేష్ నదిలో ఈతకు వెళ్లి మునిగి చనిపోయాడు. కాగా వారం వ్యవధిలో రెండు ప్రమాదాలు జరగటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కృష్ణానదిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ఈతకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

మఠంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంబోడుతండాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ ప్రాంభమైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 3వ తరగతిలో 40 సీట్లు, 4లో 38, 5లో 34, 6లో 24, 7లో 24, 8లో 24, 9వ తరగతిలో 21సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. అడ్మిషన్ల వివరాల కోసం 808212629, 9848767230 ఫోన్ నంబర్లకు సంప్రదించగలరని కోరారు.

పలు తండాల్లో 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కొండమల్లేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో 600లీటర్ల బెల్లం పానకాన్ని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. మేగ్యతండా, ఆంబోతుతండ, బండమీదితండ, పన్నితండాల్లో తనిఖీలు చేసి 600లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 47 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గొలుసు చోరీ చేసిన మహిళ అరెస్టు

- కాలనీలో పనిచేసే

మహిళగా గుర్తింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు, అపహరించిన గొలుసు

నేరేడుచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని గ్రంథాలయం వీధిలో కళ్లలో కారం కొట్టి వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు దొంగిలించిన మహిళను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. శుక్రవారం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని 11వ వార్డులో నివాసముంటున్న గుండా చంద్రకళ ఇంటికి వచ్చిన మహిళ తాగునీరు అడిగి మాయమాటలు చెప్పి కళ్లలో కారంకొట్టి రెండుతులాల బంగారు పుస్తెలతాడును చోరీ చేసింది. బాధితుల నుంచి ఫోన్ రాగానే వెంటనే కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా హుజూర్‌నగర్ బస్‌స్టాప్ వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న అమరారపు మంజులను పోలీసులు తనిఖీచేయగా బంగారపు గొలుసు కనిపించిందన్నారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా చంద్రకళ మెడలోని గొలుసు దొంగతనం చేసినట్లు ఆమె అంగీకరించిందని తెలిపారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. . మంజుల పట్టణంలో పలు గృహాల్లో పనులు చేస్తూ ప్రతి నెలా సుమారు రూ.17వేలు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషిస్తుందన్నారు. 24గంటల్లో కేసును ఛేదించడంపై ఎస్ఐ రవీందర్‌ను ఎస్పీ నర్సింహ అభినందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవీందర్, సిబ్బంది వీరాంజనేయులు, వెంకన్న, విష్ణు, శ్రీలత, జ్యోతి, సురేష్ తదితరులున్నారు.

ఇంటి ముందే వంటా వార్పు



ఇంటిముందు బైఠాయించి నిరసన చేస్తున్న అత్తాకోడళ్లు, స్థానికులు

నార్కట్‌పల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : తమ భర్తల తీరును నిరసిస్తూ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో అత్తాకోడళ్లు చేపట్టిన నిరసన రెండో రోజైన శుక్రవారం కొనసాగింది. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని వారు భీష్మించారు. ఇంటికి తాళం వేసిన వెళ్లిన తండ్రీకొడుకులు తమ భార్యల నిరసనతో శుక్రవారం కూడా అజ్ఞాతంలోనే ఉన్నారు. గురువారం రాత్రి తమ తల్లిదండ్రుల తరపువారితో ఇంటి ముందు వేసిన టెంట్ కిందే నిద్రించిన అత్తాకోడళ్లు శుక్రవారం అదే టెంట్ కింద వంటా వార్పు చేశారు. వీరికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్న స్థానిక మహిళలు నిరసనలో కూర్చుని మద్దతు పలికారు. భార్యలను ఇంటికి రానివ్వని తండ్రీ కొడుకులు బద్దుల మల్లేశ్, మహేశ్‌ల నిర్వాకాన్ని వారు తప్పుపట్టారు. మహేశ్ భార్య దుర్గామల్లేశ్వరి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు పెళ్లి సమయంలో ఒప్పుకున్న మేరకు ఇచ్చారని, ఇంట్లో ఉన్న కొన్నిరోజులు కూడా ఏంచేసినా భరించానని, అవమానించినా సహించానని అన్నారు. తనకు భర్తపై ఇప్పటికీ ప్రేమ తగ్గలేదని చెప్పారు. విడాకుల నోటీసులు పంపిస్తున్నామని చెప్పారని, అందుకు తాను సిద్ధంగా లేనని అన్నారు. చావో బతుకో తన భర్తతోనే అని భావోద్వేగం చెందారు. అత్త యాదమ్మ మాట్లాడుతూ తనను కూడా నమ్మించి మోసం చేశారని ఆరోపించింది. తనను రెండో వివాహం చేసుకునే సమయంలో కొన్ని స్థిరాస్తులు తన పేరుమీద చేస్తానని నమ్మించి ఇంతవరకూ చేయలేదన్నారు. తనను ఇంటి నుంచి బయటికి గెంటేశారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని అత్తాకోడళ్లు తెలిపారు. కాగా వీరి ఆందోళనకు ఐద్వా నాయకురాలు జిట్ట సరోజ మద్దతు తెలిపారు. పోలీస్ అధికారులు స్పందించి తక్షణమే వీరిద్దరికీ న్యాయం చేయాలని కోరారు.

విజయీభవ



నార్కట్‌పల్లిలోని అమ్మల కోవెల ఆలయంలో జాతీయ పతాకాలు అలంకరించి పూజలు చేస్తున్న అర్చకులు



యాదగిరిగుట్టలో..



హుజూర్‌నగర్‌లో..

పాకిస్తాన్‌తో భారత్ సైన్యం చేస్తున్న పోరాటానికి యావత్ దేశం మద్దతుగా నిలుస్తోంది. ఉగ్రమూకలను దేశంపైకి వదిలి రాక్షసానందం పొందిన దాయాది దేశానికి మన సైన్యం చెబుతున్న సమాధానానికి అంతా హర్షతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని అమ్మల కోవెల దేవాలయంలో జాతీయ పతాకాలతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గాదేవి, రేణుకాఎల్లమ్మ, వాసవీమాతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ దేవరశెట్టి నారాయణ, అర్చకులు సత్యశేఖర శర్మ, పుట్టపాక మురళీధర్‌రావు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఉస్మానియా మసీద్‌లో హుజూర్‌నగర్‌కు చెందిన ముస్లింలు జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో ఎండీ అజీజ్‌పాషా, మన్సూర్‌అలీ, షంషద్దీన్, మున్నా పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ఆర్ఎస్ఎస్, బజరంగదళ్, బీజేపీ ఆధ్వర్యంలో సింహద్వారం నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రచ్చ శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, గుంటిపల్లి సత్యం, తాళ్ల భాస్కర్‌రెడ్డి, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు. ● నార్కట్‌పల్లి, హుజూర్‌నగర్, యాదగిరిగుట్ట రూరల్

గ్రామాధికారులు వస్తున్నారు

(5వపేజీ తరువాయి)

ఉన్న గ్రామాల్లో నిర్వహిస్తారని, ఆ తదుపరి క్రమంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని నిర్ణయించారు.

అసైన్డ్‌భూముల అంశం 2017 ప్రామాణికం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రధానంగా నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట రెవెన్యూ డివిజన్లలో అసైన్డ్‌భూముల పట్టాల వివాదాలు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. అయితే భూభారతిలో వీటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రధానంగా గిరిజన, ఆదివాసీ, దళితులకు సంబంధించి పట్టాదారులే ఈ సమస్యలను ఎదుర్కొంటుండడంతో దీని పరిష్కారానికి భూభారతిలో అవకాశం కల్పించారు. అయితే 2017 తర్వాత అసైన్డ్‌పట్టాలు ఉంటే చెల్లవని, అంతకు ముందు ఉన్న పట్టాలుంటే వాటి ఆధారంగా క్రయ, విక్రయాలు, లావాదేవీలు ఉంటే వాటిని పరిశీలించి మోఖాపై ఉన్న రైతులకు పట్టాలివ్వాలని నిర్ణయించారు. పంచనామా, సర్వే నిర్వహించి ఈ పట్టాలు అందిస్తారు. అయితే సాగుదారు తప్పనిసరిగా మోఖాపై ఉండాల్సిందేనని, 2017కు ముందే అసైన్డ్ అయిన భూమి అయి ఉండడంతో పాటు, లావాదేవీ, క్రయవిక్రయాలు సైతం అంతకు ముందే జరిగి ఉండాలనే నిబంధనను కచ్చితంగా వర్తింపజేయనున్నారు. ఈ వెసులుబాటులో పెండింగ్‌లో ఉన్న అసైన్డ్ పట్టాల సమస్యలకు పరిష్కారం లభించనుంది.

సాదాబైనామాలకు మోక్షం

గ్రామీణ ప్రాంత భూముల వివాదాల్లో కీలకమైన సాదాబైనామా రిజిస్ట్రేషన్లకూ భూభారతిలో మోక్షం కలగనుంది. భూభారతి అమల్లోకి వచ్చిన వెంటనే ఆర్డీవోల ద్వారా సాదాబైనామాల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. 2014కు ముందు సాదాబైనామా ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినవారికి భూభారతిలో రిజిస్ట్రేషన్ చేసి, పట్టాలు అందించాలని నిర్ణయించారు. ఆర్డీవో స్థాయిలో వీటిని పరిష్కరించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ప్రవేశపెట్టినప్పుడు సైతం సాదాబైనామాలకు రిజిస్ట్రేషన్ల అవకాశం కల్పిస్తామని చెప్పినప్పటికీ దరఖాస్తులు తీసుకొని వదిలేశారు. 2020 అక్టోబరు, నవంబరు నెలల్లో ఈ దరఖాస్తులు తీసుకున్నారు. వాటినే ఇప్పుడు పరిష్కరించాలని నిర్ణయించారు. సాదాబైనామాల ద్వారా భూముల కొనుగోలు చేసిన రైతులు మోఖాపై వారే ఉంటున్నప్పటికీ, రిజిస్ట్రేషన్లుకాకపోవడంతో పట్టాలు పొందలేకపోయారు. దీంతో ప్రభుత్వం అందించే రైతుభరోసా, రైతుబీమా, పంటరుణాలు, ఎరువుల సబ్సిడీ, ఇతరత్రా ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. ఈ డిమాండ్ ప్రధానంగా ఉండడంతో భూభారతిలో ఈ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాదాబైనామాల కింద సుమారు 1,60,263 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఆయా ఆర్డీవోలు పరిశీలించి పరిష్కరించనున్నారు.

జిల్లా	రెవెన్యూ గ్రామాలు	వీఎల్ఏలు	లైసెన్స్‌డ్ సర్వేయర్లు	సాదాబైనామా దరఖాస్తులు
నల్లగొండ	565	565	565	82,134
సూర్యాపేట	486	486	486	45,219
యాదాద్రి	321	321	321	32,910
మొత్తం	1372	1372	1372	1,60,263

అనువైన వరి విత్తనాలు వేయాలి

● భీమనపల్లిలోని రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త దామోదర్‌రాజు

భూదాన్‌పోచంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మూసీ పరివాహకంలోని రైతులు అనువైన వరి విత్తనాలను వాడి అధిక దిగుబడి సాధించాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భీమనపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్‌రాజు రైతులనుద్దేశించి మాట్లాడుతూ యూరియా వాడకం, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మూసీ పరివాహకంలో అనువైన వరి వంగడాలను, రకాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, మరో శాస్త్రవేత్త డాక్టర్ సమత, వ్యవసాయాధికారి ఎ శైలజ, ఏఈవోలు పాల్గొన్నారు.

ఎయిమ్స్ డైరెక్టర్‌గా శాంతాసింగ్

● అదనపు బాధ్యతలు స్వీకరించిన మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్



శాంతాసింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఎయిమ్స్ అధికారులు

బీబీనగర్, మే 9(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) డైరెక్టర్‌గా మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ అహంత్యం శాంతాసింగ్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు మంగళగిరి నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు చేరుకున్న ఆయనకు ప్రధాన విభాగాల అధిపతులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. డైరెక్టర్ కార్యాలయంలోకి తీసుకువెళ్లగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రస్తుతం కొనసాగుతున్న ఓపీ విభాగాలను, నిర్మాణంలో ఉన్న నూతన భవన సముదాయాలను సందర్శించారు. కాగా ఎయిమ్స్‌లో ఓపీ సేవలు మొదలు పెట్టినప్పటినుంచి ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని ఇక్కడి అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఇక నుంచి కూడా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు.

మిస్ వరల్డ్ పోటీదారులకు అన్ని ఏర్పాట్లు

● యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ● పటిష్ఠమైన భద్రతా చర్యలు : నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ ● ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలి : సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి





భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు, నాగార్జునసాగర్‌లో ఏర్పాట్లపై చర్చిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఏఎస్పీ మౌనిక

భూదాన్‌పోచంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిస్ వరల్డ్-2025 లో భాగంగా ఈ నెల 15న భూదాన్‌పోచంపల్లి సందర్శించనున్న ప్రపంచ సుందరీమణులకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని రూరల్ టూరిజం సెంటర్‌ను సందర్శించి ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. రూరల్ టూరిజం సెంటర్ ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలన్నారు. మ్యూజియంలో చేనేత థీమ్ నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హంపీ థియేటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, క్రైమ్ డీసీపీ అరవింద్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, టూరిజం శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దారు నాగేశ్వర్‌రావు, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

భూదాన్‌పోచంపల్లికి ఈ నెల 15న మిస్‌వరల్డ్ పోటీదారులు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులు సందర్శించి, సమీక్ష నిర్వహించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని రూరల్ టూరిజం సెంటర్‌ను స్పెషల్ బ్రాంచ్ డీసీపీ జి.నర్సింహారెడ్డి, ఏఆర్ డీసీపీ శ్యాంసుందర్ సందర్శించి ఏర్పాట్లపై చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో ఐటీ ఏసీపీ నరేందర్, ఎస్‌డబ్ల్యూ ఏసీపీ శైలజ, సీఐ రాములు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ నెల 12న సాగర్‌కు రానున్న సుందరీమణులు

నాగార్జునసాగర్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులకు ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సాగర్ హిల్‌కాలనీ విజయవిహార్‌లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న సాగర్‌కు వచ్చే మిస్ వరల్డ్ పోటీదారులకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సాగర్‌కు వచ్చి తిరిగి వెళ్లే వరకు పోటీదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనికమిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్, హాలియా సీఐలు శ్రీను నాయక్, జనార్ధన్, ఎస్ఐలు సంపత్, వీరబాబు, వీరశేఖర్, సతీష్ పాల్గొన్నారు.



ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసిన సిబ్బంది

కమలా నెహ్రూ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు

ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌కు ఈ నెల 12న మిస్ వరల్డ్-2025 పోటీదారులు రానున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఎమర్జెన్సీ మెడికల్ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో ఐదు పడకలతో అత్యవసర చికిత్సకోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వార్డులో ఎమర్జెన్సీ లైఫ్ సేవింగ్ మందులు, ఆక్సిజన్ మినిటర్స్‌తోపాటు 24గంటలకు అందుబాటులో వైద్యులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసరంగా అబులెన్స్ సౌకర్యం తోపాటు అన్ని రకాల రక్తగ్రూపుల నిల్వలను అందుబాటులో ఉంచుతామన్నారు.

ముద్దుగుమ్మల కోసం ముస్తాబు

(5వపేజీ తరువాయి)

ముఖ్యకార్యదర్శులు జయేష్‌రంజన్, స్మితాసబర్వాల్, డైరెక్టర్ హనుమంతు కే.జెండగే, కలెక్టర్ ఎం.హనుమంతరావు, టూరిజం శాఖలోని పలువురు రాష్ట్రస్థాయి అధికారులు నిత్యం భూదాన్‌పోచంపల్లిని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ప్రపంచ సుందరీమణులు సందర్శించనున్నారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆలయ ఈవోగా కొనసాగుతున్నారు. పోటీదారుల పర్యటనపై ఇప్పటికే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు స్వామివారిని దర్శించుకునేందుకు రానుండగా, ఆలయ సంప్రదాయాలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ మాడవీధల్లో రెడ్ కార్పెట్‌ను ఏర్పాటుచేయడంతోపాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఎండలు విపరీతంగా మండుతుండటంతో సాయంత్రం వేళలో ఆలయాన్ని సందర్శించనున్నారు. అదేవిధంగా ప్రపంచ గుర్తింపు పొందిన మరో ప్రాంతమైన భూదాన్‌పోచంపల్లిలో మిస్‌వరల్డ్ పోటీదారులు పర్యటించనున్నారు. ఇక్కడ తయారైన చీరలు దేశ, విదేశాల్లో బహుళ ప్రాచుర్యం పొందాయి. భూదాన్‌పోచంపల్లి అనగానే మగువలు మెచ్చే పట్టుచీరలకు నిలయం. ప్రపంచంలో అత్యుత్తమ పర్యాటక గ్రామంగా యునెస్కో గుర్తించిన భూదాన్‌పోచంపల్లిని సుందరీమణులు సందర్శించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. సంప్రదాయ చీరకట్టులో కళాత్మకంగా నేసిన చీరలను ధరించనున్నారు. భూదాన్‌పోచంపల్లిలో టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల తయారీ కేంద్రాలను పరిశీలించనున్నారు. ఈనేపథ్యంలో అందెగత్తెలరాక సందర్భంగా యాదగిరిగుట్ట దేవస్థానంతోపాటు భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శించిన అనంతరం భూదాన్‌పోచంపల్లికి వెళ్లనున్నారు. మొత్తం జిల్లాలో రెండు గంటలపాటు పర్యటన ఉండనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సుందరీకరణ పనులేవీ?

● కళావిహీనంగా పోచంపల్లి రూరల్ టూరిజం ● వీధిలైట్లు వెలగక అంధకారంలో పోచంపల్లి వీధులు

మిస్ వరల్డ్ పోటీలను ప్రభుత్వం హైదరాబాద్‌లో అట్టహాసంగా నిర్వహించనున్నది. ఈ నెల 10వ తేదీ నుండి 31 వరకు జరుగనున్న మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీల కోసం ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల సుందరీమణులు రాష్ట్రానికి రానున్న విషయం విదితమే. మిస్‌వరల్డ్ కంటెస్టెంట్స్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఇక్కత్ పట్టుచీరల ఉత్పత్తి కేంద్రమైన భూదాన్‌పోచంపల్లి సందర్శించనున్నారు. ఈనెల 15న భూదాన్‌పోచంపల్లికి సుందరీమణులు సందర్శించి 'చేనేత థీమ్' పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. అయితే భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గ్రామీణ పర్యాటక కేంద్రంలోని మ్యూజియం తోపాటు, ఆవరణలో ప్రపంచ అందగత్తెలు ఆహ్లాదకరమైన వాతావరణం ఆస్వాదించేందుకు వారికి తగిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)





కళావిహీనంగా మారిన పోచంపల్లి రూరల్ టూరిజం ఆవరణం, ప్రమాదాలకు నిలయంగా మారిన పోచంపల్లి పెద్ద చెరువు

భూదాన్‌పోచంపల్లిలో సుందరీమణుల రాక కోసం ఎలాంటి ఏర్పాట్లు ప్రారంభించలేదు. రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన స్మిత సబర్వాల్ ఒకసారి భూదాన్‌పోచంపల్లి సందర్శించి సుందరీమణుల ఏర్పాటుకు తగిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి వెళ్లారు. ఆ తర్వాత సుందరీకరణ పనులు ఏమాత్రం ప్రారంభించలేదు. భూదాన్ పోచంపల్లిలో ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఇక్కడ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. మిస్‌వరల్డ్ కంటెస్టెంట్స్ పోచంపల్లి సందర్శన కార్యక్రమం రాష్ట్ర ఇన్‌చార్జి లక్ష్మీ ఈనెల 3న భూదాన్‌పోచంపల్లి సందర్శించి స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు. ఇప్పటికైనా అందెగత్తెల సందర్శనకు ఏర్పాట్లు సిద్ధం చేయాల్సిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉంది. ఈ నెల 15న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి సందర్శించనున్న సుందరీమణులకు ఇప్పటికి ఎలాంటి ఏర్పాట్లు అధికార యంత్రాంగం చేపట్టకపోవడం శోచనీయం. ఈనెల 15న 25 మంది సుందరీమణులు సాయంత్రం 6 గంటలకు పోచంపల్లిలోని తెలంగాణ చేనేత పరిశ్రమను పరిశీలించేందుకు సందర్శిస్తారు. ఈ మేరకు పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ ప్రపంచ సుందరీమణులకు వేదిక కానున్నది.

పోచంపల్లి పట్టణ సుందరీకరణ చర్యలు ఏవి?

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూదానోద్యమం అంకురార్పణ జరిగిన భూదాన్ గంగోత్రిగా, చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరల తయారీ కేంద్రం 'సిల్కుసిటీ'గా, యునెస్కో నిర్వహించిన పోటీల్లో ప్రపంచ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రంగా ఖండాంతర ఖ్యాతి పొందినది భూదాన్‌పోచంపల్లి. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ ఈనెల 15న పోచంపల్లిని సందర్శించనున్నారు. అయితే వారికి తగు వసతి ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. రూరల్ టూరిజం సెంటర్‌కు చేరుకునే ప్రపంచ సుందరీమణులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఆవరణను లాన్‌తో సస్యశ్యామలం చేయాల్సిన అవసరం ఉంది. సర్వాంగ సుందరంగా పోచంపల్లి ఇక్కత్ ఫర్నిషింగ్ క్లాత్ రంగురంగుల వస్త్రాలతో తీర్చిదిద్దాల్సిన చర్యలు చేట్టాల్సి ఉంది. పక్కనే పెద్ద చెరువు బోటింగ్ వసతి కల్పించాల్సిన చర్యలు ఇంకా ప్రారంభించలేదు. పోచంపల్లిలోని చేనేత కళాకారులు రూపొందించిన వస్త్ర డిజైన్లు, అద్భుతమైన కళాఖండాలు ప్రపంచ సుందరీమణులు వీక్షించేందుకు గ్యాలరీ ఏర్పాటు చేయాల్సి ఉంది. హంపీ థియేటర్‌లో సుందరాంగులు హ్యాండ్లూమ్ వస్త్రాలతో ర్యాంప్ వాక్ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం చేయాల్సి ఉంది. వారికి రుచికరమైన ఆహార పదార్థాలు తయారు చేయాల్సి ఉంది. అంతేగాక వారికి స్వాగతం పలికేందుకు సాంప్రదాయ నృత్యంతో స్వాగతించేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులను సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. వీధి లైట్లు వెలగక అంధకారంలో పోచంపల్లి వీధులు నిత్యం దర్శనమిస్తున్నాయి. లైట్లు వెలగని విద్యుత్ స్తంభాలకు తెల్ల రంగు వేస్తుండడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. లైట్లు వెలిగించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపుల ఫుట్ పాత్‌లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ ప్రాబ్లమ్ నెలకొన్నది. పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన రహదారులలోని కూడల్ల వద్ద బార్ కేడ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ మధ్యలోని బటర్‌ఫ్లై లైట్లు వెలగడం లేదని అధికారులకు స్థానికులు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. హైదరాబాద్ - పోచంపల్లి రహదారిపై జలాల్‌పూర్ చెరువుకట్ట వద్ద మూలమలుపులో ప్రమాద నివారణకు ప్రభుత్వం రూ. 20 లక్షలు వెచ్చించినా.. నేటికీ పనులు చేపట్టలేదు. రోడ్డుకు పక్కన బారికేడ్‌లను తాత్కాలికంగా ఏర్పాటు చేశారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టలేదు. పోచంపల్లి మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయినా నేటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించక పోవడం శోచనీయం. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం జాప్యం జరుగుతున్న నేపథ్యంలో చెరువుకట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఇరువైపుల గ్రిల్ ఏర్పాటు చేసి లైట్లు వేయించాల్సిన అవసరం ఉంది. తరుచూ చెరువుకట్ట పై ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రపంచ సుందరీమణులు సందర్శించనున్న పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పట్టని అధికారులు



భూదాన్‌పోచంపల్లిలోని ప్రధాన రహదారులపై విద్యుత్ లైట్లు వెలుగక నెలలు గడుస్తోంది. రాత్రి పూట అంధకారంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటన్నాయి. అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టింపు లేదు. ఓ వైపు ప్రపంచ సుందరీమణులు పోచంపల్లికి వస్తున్నారని ఆర్భాటంగా స్తంభాలకు రంగులు వేస్తున్నారే తప్ప ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. వీధిలైట్లు వేయడం లేదు. చౌటుప్పల్ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు మధ్యలో ధ్వంసమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించలేదు. టూరిజం సెంటర్‌లో పర్యాటకుల సందడి లేక వెలవెల పోతోంది. జలాల్‌పూర్ చెరువు కట్ట ప్రమాద మలుపు వద్ద నివారణ చర్యలు నెలలు గడుస్తున్నా చేపట్టడం లేదు.

చింతకింది కిరణ్, భూదాన్‌పోచంపల్లి

త్వరలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని మొత్తం 23 వీధి లైట్లు వెలగడం లేదు. రెండు రోజుల్లో వీధిలైట్లు వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు ప్రారంభించాం. ఈనెల 15న పోచంపల్లికి ప్రపంచ సుందరీమణులు సందర్శిస్తున్న సందర్భంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. టూరిజం పార్కులో రంగులు వేయిస్తున్నాము. ప్రధాన సమస్యల సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తాం.

అంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, భూదాన్‌పోచంపల్లి

టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడిగా మధు

చిట్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-143) మండల అధ్యక్షుడిగా కారంపూరి మధు ఎన్నికయ్యారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారంపూరి మధు, ఉపాధ్యక్షుడిగా బొడిగె విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాంమోహన్, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, వేణు, మల్లేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దగాని యాదయ్య ఆశయాలను కొనసాగించాలి

గట్టుప్పల్, మే 9 (ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్మించిన పెద్దగాని యాదయ్య ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తీర్పారి వెంకటేశ్వర్లు కోరారు. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ పెద్దగోని యాదయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, రామలింగయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసం..ఉత్సాహం

▸▸ ఈతపై చిన్నారుల ఆసక్తి ▸▸ ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు ▸▸ వేసవి సెలవులు సద్వినియోగం



ఇండోర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న బాలబాలికలు

నల్లగొండ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వేసవి సెలవులు ఎంతో సంతోషానిస్తున్నాయి. చిన్నారులు ఒక్కొక్కరు వేసవి తా పాన్ని దృష్టిలో ఉంచుకొని దానికి ప్రత్యామ్నాయంగా భానుడి తీవ్రత ను తట్టుకునేందుకు ఈతను నేర్చుకుంటున్నారు. సరదాగా సెలవులు వినియోగించుకొని నూతన ఉత్సాహన్ని పొందుతున్నారు. పాఠశాల తరగతులకు బైబై చెప్పిన పిల్లలు, ఈత నేర్చుకునేందుకు సైసై అంటున్నారు. ఈత వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. అంతేకాక మనోధైర్యం కూడా పెరుగుతుంది. దీంతో పిల్లలకు ఈత నేర్పేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారు. ఈత ప్రాధాన్యతను తెలిసిన తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ తకొలను ప్రవేశం ఇప్పించి దగ్గరుండి మరి ఈత నేర్పిస్తున్నారు. పిల్లలు ఈత నేర్చుకోవడంతో పాటు వేసవి సెలవులను ఆస్వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో వేసవి సెలవుల్లో ఈతకొలనును ప్రారంభించారు.

నిబంధనలు పాటించాలి

స్విమ్మింగ్ పూల్‌లో అడ్మిషన్ పొందిన వారు నిబంధనలను పాటించాలి. వారికి కేటాయించిన సమయంలోనే సిమ్మింగ్ పూల్‌కు రావాలి. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మూడు బ్యాచ్‌లు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మూడు బ్యాచ్‌లు నడుస్తున్నాయి. బ్యాచ్‌లో 70 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఈతకు వచ్చే వారందరూ శుచి శుభ్రతను పాటించాలి.


ఈత శారీరక ఆరోగ్యానికి దోహదం



ప్రతి విద్యార్థికి చదువుతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో అవసరం. విద్యా సంవత్సరంలో రోజు పాఠశాలకు పుస్తకాలు మోస్తూ ఎంతో ఒత్తిడికి లోనవుతాం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆటపాటలకు విరామం లేకుండా పోయింది. కొన్ని పాఠశాలల్లో క్రీడా స్థలాలు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. వేసవి సెలవులు రావడం ఎంతో ఊరట ఇస్తుంది. ఈ మేరకు ఈతకొలనులో శిక్షణ పొందుతున్నాను. మండే ఎండలను ఈత ఉపశమనం ఇస్తుంది.

- ఏ. సాయి కృష్ణ

ఈతకొలను శుభ్రంగా ఉంచుకోవాలి



వేసవి సెలవుల్లో ఇండోర్ స్టేడియంలోని ఈతకొలను ప్రారంభించాం. రెండు నెలల పాటు ఈ కొలను నడుస్తుంది. ఇప్పటికే చాలామంది అడ్మిషన్లు పొందారు. అడ్మిషన్లు పొందిన వారు స్విమ్మింగ్ పూల్స్ నియమ, నిబంధనలు తప్పక పాటించాలి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో బ్యాచ్‌ల వారీగా ఈత కొట్టేందుకు అనుమతిస్తున్నాం. స్విమ్మింగ్ పూల్‌లోకి దిగేముందు స్నానం చేసి, స్విమ్మింగ్ డ్రెస్సులు తప్పనిసరిగా ధరించాలి. స్విమ్మింగ్ పూర్తయిన తర్వాత కూడా చర్మవ్యాధులు రాకుండా మళ్లీ స్నానం చేయాలి. బాల, బాలికలకు ఈత కొట్టేందుకు ప్రత్యేకంగా కోచ్‌లను నియమించాం. కోచ్‌ల సూచనలు, సలహాలతోనే ఈత కొట్టాలి. ఈత కొలను శుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ సహకరించాలి.

- కుంభం నర్సిరెడ్డి, డీవైఎస్‌వో అధికారి

ఉత్సాహంగా ఉంది



వేసవి తాపాన్ని తాళలేక మా తల్లిదండ్రులు ఈత శిక్షణకు పంపిస్తున్నారు. అక్కడే నూతన స్నేహితులు కూడా పరిచయమయ్యారు. వేసవి తాపానికి ఉపశమనం లభిస్తుంది. రోజూ వచ్చి ఇక్కడ ఈత కొడుతుతున్నాను. దీంతో ఎంతో ఉత్సాహంగా, ప్రశాంతంగా ఉంది. తక్కువ సమయంలోనే ఈత నేర్చుకంటున్న అందుకు ఆనందంగా ఉంది.

- కె. గోదారెడ్డి, నల్లగొండ

ప్రమాదాల నుంచి రక్షణ



ఆపద సమయాల్లో నీళ్ల ప్రమాదాల నుంచి గట్టెక్కేందుకు వేసవి సెలవుల్లో ఈత నేర్చుకుంటున్నాను. ప్రతీ రోజు ఈతకొలనుకు వచ్చి శిక్షకుని సలహాలు, సూచనలతో స్విమ్మింగ్ చేస్తున్నాను. ఈతకొలనుకు ఎంతోమంది చిన్నారులు, పెద్దలు వస్తున్నారు. వారితో పాటు నేను ఈత కొట్టడం ఆనందంగా ఉంది.ప్రతిఒక్కరూ ఈత నేర్చుకోవడం మంచింది.

- అఫ్నాన్ అహ్మద్, నల్లగొండ

ఆరోగ్యానికి చేయూత



వేసవి సెలవుల్లో రోజు సాయంత్రం ఈత కొట్టడానికి ఇండోర్ స్టేడియంలో ఉన్న ఈత కొలనుకు వస్తున్నాను. నాతో పాటు ఎంతోమంది అమ్మాయిలు ఈత నేర్చుకుంటున్నారు. అమ్మాయిలు ఈత నేర్చుకోవడం ఎంతో అవసరం. మా తల్లిదండ్రులు నేను ఈత నేర్చుకునేలా ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

- ఏ.సాన్వి, 6వ తరగతి, నల్లగొండ

వైభవంగా మారెమ్మకు బోనాలు



నెమ్మానిలో బోనాలు తీసుకువస్తున్న మహిళలు

నార్కట్‌పల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మానిలో జరుగుతున్న గ్రామ దేవత మారెమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. కల్యాణం నిర్వహించిన అనంతరం తెల్లవారుజామున బోనాలు సమర్పించడం ఆచారంగా వస్తుంది. ఇందులో భాగంగానే గురువారం కల్యాణం నిర్వహించగా శుక్రవారం ప్రతీ ఇంటి నుంచి మారెమ్మ తల్లికి మహిళలు బోనాలు తీసి సమర్పించారు. తమ కష్టాలు తీర్చాలని వేడుకుంటూ మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మారమ్మ పండుగ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యేళ్ల చలపతిరెడ్డి, సభ్యులు గంట మధుసూదన్‌రెడ్డి, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, బుర్రి ఎల్లేశ్, వంగాల రాజశేఖర్‌రెడ్డి, కర్నాటి వెంకన్న, బానాల వెంకట్‌రెడ్డి, బుర్రి వీరయ్య, వంగాల ఇంద్రారెడ్డి, ఏళ్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● *డ్రగ్స్‌పై ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం*

నార్కట్‌పల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకంపై సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ శుక్రవారం నార్కట్‌పల్లి పశువుల సంతలో వినూత్న ప్రచారం నిర్వహించారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారడం వల్ల కలిగే దుష్పలితాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రం, బ్యానర్ ప్రదర్శనతో మద్యం తాగేవారిని ఆలోచింపజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం కంటే డ్రగ్స్ మరింత నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడితే మాన్పించడం కష్టమని, దానికన్నా అలవాటు పడకుండా చేయడమే సులభమన్నారు. అందుకే తాను డ్రగ్స్ నివారణపై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్‌కు బానిసలవ్వడం ద్వారా ఎంతో మంది తల్లిదండ్రులు కుమారుల పరిస్థితి చూసి కన్నీళ్లు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

● *సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్*



ఇటుకులపహాడ్‌లో జెండా ఎగురవేస్తున్న జిల్లా కార్యదర్శులు సాగర్, చిరంజీవి

శాలిగౌరారం, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మికులు, రైతు కూలీలు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఎగరవేసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం), రైతు కూలీ సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంబటి వెంకటేశం, అంబటి నరసయ్య, ప్రభాకర్, అంబటి వెంకన్న, బండారి మురళి, తాటిపాముల వెంకటయ్య, పూలమ్మ, సావిత్రమ్మ, కొలుకొండ ధనమ్మ, వెంకన్న, రాములు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సోలిపురం వాగుపై బ్రిడ్జి వెంటనే నిర్మించాలి

● *సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురిగి చలపతి*

మునుగోడు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సోలిపురం గ్రామ వాగుపై హైలెవల్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురిగి చలపతి డిమాండ్ చేశారు. గురువారం రాత్రి సోలిపురంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 40 సంవత్సరాలుగా సరైన రోడ్డు మార్గం, బ్రిడ్జి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వివిధ పనుల నిమిత్తం మునుగోడుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బ్రిడ్జి మంజూరు చేసినందుకు సంతోషిస్తున్నాం. వెంటనే ఆ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని అన్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించి సత్తా చాటాలని అన్నారు. సమావేశంలో నాయకులు నకిరేకంటి సత్యనారాయణ, ఇరిగి లింగస్వామి, నకిరేకంటి కాశీం, మరిపెల్లి రాజయ్య, లింగయ్య, ఇరిగి యాదయ్య, స్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

● *ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి*



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో లోక రక్షకుడు, ఆదర్శమూర్తి రాముల వారి దేవాలయం నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకుని మానసికంగా ప్రశాంతంగా ఉండాలని అన్నారు. నిర్వాహకులు ప్రతిష్ఠ అనంతరం స్వామివారికి కల్యాణం నిర్వహించి డప్పుచప్పుళ్ల కోలాటాల మధ్య స్వామివారిని ఘనంగా ఊరేగించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వరరెడ్డి తల్లిగారైన నరసమ్మ కొద్ది రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, నాయకులు కుంభం కృష్ణారెడ్డి, పూల వెంకటయ్య, ఏరెడ్ల రఘుపతిరెడ్డి, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, గట్టుపల్లి నర్సిరెడ్డి, కోట రఘు నందన్, అల్లంపల్లి ఆనంద్, పెద్దిరెడ్డి అనంతరెడ్డి, సంగేపు గణేష్, మహేష్ గౌడ్, కిరణ్, చంద్రశేఖర్, శేఖర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మనఊరు పిల్లల్ని మన బడిలోనే చేర్పించాలి



ఉపాధి కార్మికులకు ప్రభుత్వ పాఠశాల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

మునుగోడురూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మనఊరు పిల్లల్ని మన బడిలోనే చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు తాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలంలోని పలివెల గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని చెరువులో పనిచేస్తున్న ఉపాధి కార్మికుల దగ్గరకు వెళ్లి మాట్లాడారు. మన ఊరు పిల్లల్ని మనబడిలో చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజు భారం తగ్గించుకోవాలని శ్రీనివాసులు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన విద్య అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీ, పెరిక నరసింహ, ఉయ్యాల యాద య్య, గేర నరసింహ, వెంకన్న, రాఘవేంద్ర, అంజయ్య, విద్యార్థులు శ్రీజ, ఉమ, శృతి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కార్మికులకు ఇంటి నిర్మాణం

● *మానవత్వం చాటుకున్న గట్టుప్పల్ పద్మశాలి సంఘం నాయకులు*

గట్టుప్పల్, మే 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేద చేనేత కార్మికులకు పద్మశాలీ యువజన సంఘం నాయకులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన నిరుపేద చేనేత కార్మికులు చిలుకూరు అంజయ్య, సత్తయ్యలకు ఉండటానికి ఇల్లు లేక బస్టాండ్, వివిధ ప్రధాన కూడలిలో జీవనం కొనసాగిస్తున్నారు. వారి స్థితిని గమనించిన పద్మశాలీ యువజన సంఘం నాయకులు ఇల్లు నిర్మించాలని నిశ్చయించుకున్నారు. వరుసకు అన్నదమ్ములైన అంజయ్య, సత్తయ్యలకు కలిపి సంఘం ఆధ్వర్యంలో డబ్బులు జమ చేసి ఒక గది ఇంటిని నిర్మించారు. శుక్రవారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు కర్నాటి వెంకటేశం ప్రారంభించి వారికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, మాజీ జడ్పీటీసీ నామని గోపాల్, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిషోర్, నాయకులు పున్న ఆనంద్, నామని బుచ్చయ్య, కర్నాటి వెంకటేశం, తిరందాస్ ఆనంద్, చెరుపెల్లి సత్తయ్య, చిలుకూరి అంజయ్య, కర్నాటి లింగయ్య, సాంబయ్య, జగన్, కోటయ్య, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ వి.శంకర్

నల్లగొండటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసైసు లభమార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు కొనుగోలు చేస్తున్న వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.3 కిలోల గంజాయిని మోటార్ సైకిల్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బాహర్‌పేటకు చెందిన జొన్నల రవీందర్ అలియాస్ బాబి స్వీపర్ పని చేస్తుండేవాడు. ఆయన తన స్నేహితురాలైన జమ్మలగూడకు చెందిన రమ్యకృష్ణ అలియాస్ పింకితో కలిసి కొంతకాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో గంజాయి వాడటంతో పాటు విక్రయిస్తే తమ ఖర్చులు మిగలడంతో పాటు లాభాలు వస్తాయని ఆశించారు. దీంతో అక్రమంగా సంపాదించాలనే ధ్యేయంతో రవీందర్ హైదరాబాద్‌లోని దూల్‌పేటలో గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా గంజాయిని కొనుగోలు చేశాడు. కొంత వాడుకొని మిగితాది ఎక్కువ ధరకు అవసరం ఉన్న వారికి విక్రయించేవారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం రవీందర్ కిలోన్నర గంజాయిని దూల్‌పేటలో కొనుగోలు చేసి కొంత తాను రమ్యకృష్ణ వాడుకున్నారు. మిగతాది పట్టణంలో కావాల్సిన వారికి అమ్మాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం తులసీనగర్ కట్ట మైసమ్మ గుడి వద్ద చైతన్యనగర్‌కు చెందిన ఏసీ టెక్నీషియన్ యానక నరేష్‌పాల్‌కు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి, సెల్‌ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ కేసులో రమ్యకృష్ణ పరారీలో ఉన్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వి.శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్



కొండకిందిగూడెంలో దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న గోలి ప్రభాకర్

కేతేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని దివ్యాంగులకు పంచాయతీ ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండకిందిగూడెంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు దివ్యాంగులకు ప్రస్తుత రూ.4 వేల పింఛన్ స్థానంలో రూ.6వేలు ఇవ్వాలని, ఉచిత బస్సు ప్రయాణ అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో డిగ్నిఫైడ్ ఇండిపెండెన్స్ పంచాయతీ కోఆర్డినేటర్ అంజయ్య, దివ్యాంగులు పాల్వాయి సందీప్, ఎం.సిరి, సుప్రియ, డి.వెంకటసాయి, వి.రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

శాపల్లిలో నేడు నృసింహ జయంతి వేడుకలు

ఆలయం వద్ద 11న గిరిప్రదక్షిణ ప్రారంభం




శాపల్లి కమలాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం రాజగోపురం (ఇన్‌సెట్‌లో) లక్ష్మీనర్సింహస్వామి

నార్కట్‌పల్లి,మే 9(ఆంధ్రజ్యోతి): నృసింహ జయంతి వేడుకలకు నార్కట్‌పల్లి మండలం శాపల్లిలో గల ప్రసిద్ధ వైష్ణవాలయం కమలాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సిద్ధమైంది. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన స్వామివారి జయంతి వేడుకల్లో భాగంగా పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు తెలిపారు.ఈఉత్సవాలకు ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి హాజరుకానున్నారు. గ్రామానికి చెందిన భక్తుడు, ఏపీ బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కెనపల్లి లక్ష్మయ్య దాతగా స్వామివారికి 6 నెలల పాటు పంచామృతాభిషేకాలు చేయనున్నారు.

శాపల్లిలో గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు

దేవస్థానాల వద్ద గిరి ప్రదక్షిణకు ఎంతో విశిష్టత ఉంటుంది. మానసిక,గ్రహ,శారీరక రుగ్మతలతో ఇబ్బంది పడే బాధితులు ఆలయాల చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తే తొలగిపోతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది. ఇందులో భాగంగానే యాదాద్రి దేవస్థానంలో ఇటీవలే గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రతీనెలా యాదాద్రిలో నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో తొలిసారిగా శాపల్లిలో కూడా కమలాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం చుట్టూ గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11వ తేదీన గిరిప్రదక్షిణ ప్రారంభించనున్నట్లు కారంపూడి నర్సింహాచార్యులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 10 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.4



విద్యుత్ దీపాల అలంకరణలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట నృసింహుడి ఆలయం

తిరువేంకటాధీశ.. నారసింహ

వైభవంగా జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సంప్రోక్షణ అనంతరం స్వస్తివాచనంతో వేడుకలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. తొలుత విష్వక్సేనారాధన అనంతరం పుణ్యాహవాచనం నిర్వహించారు. గర్భాలయానికి అభిముఖంగా లక్ష కుంకుమార్చన చేపట్టిన అర్చకులు స్వామివారిని తిరువేంకటపతిగా దివ్యమనోహరంగా అలంకరించి వేద పారాయణంతో తిరువీధి సేవ నిర్వహించారు. సాయంత్రం మృత్సంగ్రహణం నిర్వహించగా ఉత్తర తిరువీధిలోని ఏర్పాటుచేసిన యాగశాలలో అంకురారోపణ చేసి హవనం నిర్వహించారు. • 6లో



ముద్దుగుమ్మల కోసం
ముస్తాబు

» యాదగిరిగుట్ట, పోచంపల్లిలో ప్రత్యేక ఏర్పాట్లు
» ఈ నెల 15న రానున్న మిస్‌వరల్డ్ పోటీదారులు



పోచంపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం మిస్‌వరల్డ్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి సుందరీమణులు తరలిరానున్నారు. శనివారం నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. అయితే ప్రభుత్వం తెలంగాణలోని సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని, చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి చూపించాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మిస్ వరల్డ్ పోటీదారులు ఈ నెల 15న యాదాద్రి జిల్లాలో పర్యటించేందుకు టూరిజం శాఖ సన్నాహాలు చేసింది. ఈమేరకు ప్రపంచ అందగత్తెలు రాష్ట్రంలోని ఏఏ ప్రాంతాలను సందర్శించాలన్న కార్యక్రమాల వివరాలను అధికారికంగా నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న వారు సందర్శించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతతోపాటు ప్రోటోకాల్‌పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు కార్యక్రమ నిర్వహణపై నేరుగా సమీక్షలు నిర్వహిస్తూ, ఏర్పాట్లపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర పర్యాటక శాఖ...

- మిగతా 7వ పేజీలో...



గ్రామాధికారులు
వస్తున్నారు

భూభారతి చట్టం జూన్ 2 నుంచి అమలులోనికి రానుండగా, అదే రోజు నుంచే భూ సంస్కరణల అమలుకు రెవెన్యూశాఖ రంగం సిద్ధం చేసింది. ప్రధానంగా ప్రతి రెవెన్యూగ్రామానికి ఒక గ్రామపాలనాధికారితో పాటు, మరో లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను నియమించనుంది. సుమారు పదేళ్లుగా భూ పట్టాల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించనుంది. అంతేకాక సాదాబైనామాలు, ఇతర భూవివాదాలను పరిష్కరించనుంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

» ప్రతీ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి, సర్వేయర్
» భూవివాదాల పరిష్కారమే లక్ష్యంగా 'భూభారతి'
» జూన్ 2నుంచి కొత్తచట్టం అమలు
» ప్రతీ గ్రామంలో సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారం
» సాదాబైనామాలు పరిష్కరించే దిశగా..
» సమగ్ర భూసర్వే చేయాలనే డిమాండ్లు

భూ వివాదాల పరిష్కారానికి ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని తహసీల్దార్ నేతృత్వంలోని బృందం సందర్శించనుందని, దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 8న నల్లగొండ జిల్లా పర్యటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 9,26,000 సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని,అర్హులైనవారికి పట్టాలు సైతం ఇస్తామని మంత్రి ప్రకటించడంతో సాదాబైనామాల దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూమిమోఖాపై ఉన్న ప్రతీ రైతుకు,న్యాయబద్ధంగా ఉంటే పట్టా ఇస్తామని తేల్చిచెబుతుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పాలనాధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్

గత ప్రభుత్వం ధరణిని అమలులోకి తేవడంతోపాటు, వీఆర్వో వ్యవస్థను పూర్తిగా తొలగించింది. దీంతో గ్రామాల్లో రెవెన్యూ పాలనా వ్యవస్థ లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టింది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునఃప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక విలేజ్ లెవల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (పూర్వపు వీఆర్‌వో స్థాయి), మరో లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను నియమించాలని నిర్ణయించింది. వీఎల్‌వోల కోసం పూర్వపు వీఆర్‌వోలు, అర్హత కలిగిన వీఆర్‌ఏలను దరఖాస్తు చేసుకోవాలని సూచించి, వారికి అవకాశం కల్పించగా, లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ప్రైవేట్ సర్వేయర్లకు, సర్వే శిక్షణ పొందిన యువతకు అవకాశం కల్పిస్తోంది. వీరందరికీ శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగించనుంది. సర్వేయర్ల కొరతతో ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో భూముల వివాదాలు నెలకొన్నాయి. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక సర్వేయర్‌ను నియమిస్తే సర్వేల సమస్యలు పరిష్కారమవుతుందనే నమ్మకంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వీఎల్‌ఏలు, సర్వేయర్లు జూన్ 2నుంచి విధుల్లోకి రానున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,372 రెవెన్యూ గ్రామాల్లో ప్రతీ గ్రామానికి ఒక వీఎల్‌వో, మరో సర్వేయర్ నియామకం కానున్నారు.

జూన్ 2 తర్వాత రెవెన్యూ సదస్సులు

భూభారతి చట్టం అధికారికంగా జూన్ 2వ తేదీ నుంచి అమల్లోకి రానుండటంతో, అదే రోజు నుంచి ప్రతీ రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. తహసీల్దార్ నేతృత్వంలోని రెవెన్యూ బృందాలు ప్రతీ రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకొని పరిష్కరిస్తారు. భూభారతితో దాదాపు 80శాతం సమస్యలు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారమవుతుండగా, మరో 10శాతం ఆర్డీవో, ఇంకో 10శాతం కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యే అవకాశముందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో భూ సమస్యలున్నవారంతా గ్రామాల్లో జరిగే సదస్సుల్లో సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరుతున్నారు. ఈ సదస్సులను తొలుత పైలెట్ మండలాల్లో, ఆతర్వాత భూ సమస్యలు ఎక్కువగా

మిగతా 7వ పేజీలో...

భూముల రీసర్వే చేయాల్సిందేనని డిమాండ్లు

గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్న సందర్భంలో ప్రభుత్వం పాత అనుభవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సమగ్ర భూసర్వే నిర్వహించాలనే సూచనలు వస్తున్నాయి. భూసర్వేతో పాటు కొత్త నక్షాలు, కొత్త రెవెన్యూ రికార్డులు రాయాలనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్ సర్వేయర్లు కాకుండా తిరుమలగిరి (సాగర్) తరహా ప్రభుత్వ సర్వేయర్లతో సమగ్రంగా భూముల సర్వే నిర్వహించి భూధార్ నెంబర్ లేక సర్వేనెంబర్లు కేటాయించాలని కోరుతున్నారు. అదేవిధంగా కొత్త గ్రామ నక్షాలు, కొత్త రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ భూములకు కంచెలు వేయాలని, ప్రభుత్వ ఆస్తులైన దేవాదాయ, వక్ఫ్, రిజర్వ్‌ఫారెస్ట్ భూములకు, చెరువులు, కుంటలు, గ్రామ కంఠం భూములు, శ్మశానవాటికలకు హద్దులు నిర్ణయించాలని కోరుతున్నారు. ప్రతీ పంచాయతీని ఒకరెవెన్యూ గ్రామంగా గుర్తించి రికార్డులు, నక్షాలు రూపొందించాలనే అభిప్రాయాలు వస్తున్నాయి.

అణగారినవర్గాల హక్కుల పతాక భీంరెడ్డి

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మట్టయ్య



రామచంద్రాపురం వైజంక్షన్ వద్ద బీఎన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యు) నాయకులు

మిర్యాలగూడ, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట గెరిల్లా సేనాని, సామాజిక ఉద్యమకారుడు, అణగారినవర్గాల హక్కుల పతాక భీంరెడ్డి నర్సింహారెడ్డి అని ఎంసీపీఐ(యు)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. శుక్రవారం రాంచంద్రాపురం వైజంక్షన్ వద్ద మాజీ ఎంపీ, ఎంసీపీఐ(యు) పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు బీఎన్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. తెలంగాణ పల్లెల్లో నాడు ప్రజలపై దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాములు అమలు చేస్తున్న తీవ్ర నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ భూమి, భుక్తి, విముక్తి నినాదంతో రైతులను ఉద్యమంలో సమీకరించి, గెరిల్లా పోరాటానికి బీఎన్‌రెడ్డి నాయకత్వం వహించారన్నారు. నిర్బంధం ఎంత పెరిగినా, వెనుదిరిగి చూడక రహస్య ఉద్యమంలో మరింతగా రాటుదేలారని అన్నారు. నైజాం రజాకార్ల సేనలను, పెత్తందార్లను గెరిల్లా దాడులతో గ్రామాల నుంచి తరిమేసి వెట్టిచాకిరీ నుంచి 300 గ్రామాలను విముక్తి చేశారన్నారు. భూమిలేని పేద రైతులకు 10లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని అన్నారు. స్వాతంత్రోద్యమం అనంతరం భారత ప్రజాస్వామిక ఎన్నికల్లో నిలబడి పార్లమెంట్ మెంబర్ గా గెలిచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో తన వాగ్ధాటిని వినిపించారని అన్నారు. మిర్యాలగూడ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో కేంద్రంతో కొట్లాడి బీబీనగర్-నడికుడి రైలుమార్గాన్ని ఏర్పాటు చేయించారని అన్నారు.

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెచ్చే సామాజిక ఉద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. దేశ జనాభా ప్రకారం బీసీలు 'మేమెంతో మాకంత వాటా' అని నినదించాలని పిలుపునిచ్చారు. ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేసి వామపక్ష రాజకీయ పార్టీల ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి, భరత్, లాలునాయక్, మల్లేష్, రవీందర్, మౌనిక, ఉప్పలమ్మ, గురవయ్య, కమలమ్మ, సైదానాయక్, జ్యోతి, యాదమ్మ, శారద, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరత లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ, సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీచేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రంలో రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు అనంతరం లారీలు, బస్తాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ దేవ్‌సింగ్,సింగిల్‌విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి ఉన్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు సన్నద్ధం కావాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

హాలియా, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 20న సమ్మె నిర్వహించేందుకు కార్మికవర్గం సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం హాలియాలో నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్ నాగార్జునసాగర్ నియోజకవర్గ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాస్తూ, కార్మికులను శ్రమ దోపిడీ చేస్తూ కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని విమర్శించారు. మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పిన హామీని నెరవేర్చలేదన్నారు. 11 ఏళ్ల పాలనా కాలంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్విస్ బ్యాంకులో ఉన్న అక్రమ సంపదనంతా వెలికి తీసి ప్రజలకు పంచుతానని చెప్పిన మోదీ బడా పెట్టుబడిదారుల జేబులు నింపే విధంగా కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. సమ్మెలో కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అన్వర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, నాయకులు ఎస్‌కె.బషీర్, చాంద్‌పాషా, రెబెల్లి వెంకటేశ్వర్లు, మేకల అంజనేయులు, ఎస్‌కె.సయ్యద్, హుస్సేన్, పొదిల వెంకన్న, చిరంజీవి, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24, 25న నిర్వహించే విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో టీఆర్‌జీఎస్ శిక్షణ తరగతుల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన తండాలను రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేసి సబ్‌ప్లాన్ నిధులను తండాలకే ఖర్చు చేయాలన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అటవీ భూములపై గిరిజనులకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించి, అటవీ ఉత్పత్తుల్లో గిరిజనులను భాగస్వామ్యం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలను రాజకీయ చైతన్యం దిశగా సమాయత్తం చేసేందుకు శిక్షణ తరగతులు హాలియా పట్టణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామావత్ నరేష్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత అశోక్‌నాయక్, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లాలూనాయక్,రమావత్ రమేష్‌నాయక్, నేనావత్ మునినాయక్, రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో థర్మల్ యూనిట్-1 ప్రారంభం

ట్రయల్ రన్ చేస్తున్న క్రమంలో ఆయిల్ పైపులైన్ లీకై విద్యుత్ కేబుల్ నెట్‌వర్క్ దగ్ధం

సరిచేసిన అధికారులు ● ఈ నెల చివరి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు • 7లో

రసాయనాల ఎరువుల వాడకం తగ్గించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీరమ్య

హాలియా, మే 9 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో దిగుబడి కోసం రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, పోషకాలతో కూడిన ఎరువులను వినియోగించాలని వ్యవసాయ పరిశోధనా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరమ్య, స్వాతి అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాయుడుపాలెం గ్రామంలో కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పైరు ఎదుగుదలకు అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని, తద్వారా పెట్టుబడి తగ్గుతుందన్నారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించి భూమి తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంట మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని, సాగు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సరిత, రైతులు సర్దార్, చిరంజీవి, మోతీలాల్, లక్ష్మణ్, మల్లికార్జున్‌రావు, అప్పారావు, మంద సైదులు రావుగౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య దేవరకొండ కమిటీ ఎన్నిక

దేవరకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య దేవరకొండ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షురాలిగా డిండి మండలానికి చెందిన బొల్లె మంజుల, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ పట్టణానికి చెందిన లింగంపల్లి అనితను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి మహిళ సమాఖ్య నియోజకవర్గ కమిటీ అభినందన తెలిపింది.

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

చింతపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి):పాకిస్తాన్ సైనికుల కాల్పుల్లో గురువారం రాత్రి వీర మరణం పొందిన ఏపీకి చెందిన మురళీనాయక్ మృతికి శుక్రవారం పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, శివర్ల రమేష్‌యాదవ్, కనిగిరి గోవర్ధన్, సందపట్ల రాజేష్‌సాగర్, లక్ష్మణ్ సాగర్, గొట్టే పర్వతాలు, గోవింద్ రాజు ఉన్నారు.

దారి చూపండి సారూ..



కాంప్లెక్స్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డుగా తోపుడుబండి

మిర్యాలగూడ పట్టణంలోని ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌లో దాదాపుగా 88 దుకాణాలున్నాయి. ఈ సముదాయంలోకి వచ్చే రోడ్లు మాత్రం మూసుకుపోయాయి. కోదాడ-జడ్చర్ల రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలోని సాగర్‌రోడ్‌ను విస్తరించిన అధికారులు అక్కడక్కడ పని పూర్తి చేయలేదు. రహదారికిరువైపులా వరదకాల్వ నిర్మించి, దాని పై కప్పు వేయాల్సి ఉంది. కానీ అసంపూర్తిగా వదిలివేయడంతో కాంప్లెక్స్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మ రోవైపు కాంప్లెక్స్‌లోకి వచ్చే రోడ్డును తోపుడుబండ్ల వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని దుకాణదారులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి



మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య పార్క్

మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య పార్కులో మరుగుదొడ్లు నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పార్కు పట్టణ నడిబొడ్డులో ఉన్నందున పరిసర ప్రాంత ప్రజలు ఆహ్లాదం కోసం పెద్దఎత్తున ఈ పార్క్‌కు వస్తుంటారు. అయితే పార్కులో టాయ్‌లెట్స్ లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మహిళలు మూత్రశాలల లేక పోవడంతో పార్కుకు రాలేకపోతున్నారు. కాగా ప్రాంగణం పక్కనే ఉన్న పబ్లిక్ మూత్రశాలకు పార్కులో నుంచి రహదారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

మొక్కలను పట్టించుకోరూ..



వై జంక్షన్‌లోని మినీ పార్కులో ఎండుతున్న గడ్డి

మిర్యాలగూడలోని వైజంక్షన్‌లోని మినీపార్కులో మొక్కలు ఎండిపోతున్నాయి. వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పచ్చదనం కనుమరుగవుతోంది. పట్టణ శివారులో ఉన్నందునో, మరెందుకో తెలియదు. కానీ పార్కులో పచ్చదనాన్ని పరిరక్షించడంలో పురపాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటున్నారు రామచంద్రగూడెం, ఏడుకోట్లతం డా వాసులు. ఎవరూ ఏర్పాటు చేశారన్నది ముఖ్యం కాదని, పచ్చని చెట్లకు నీరందించి పరిరక్షించాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

అలంకార ప్రాయంగా చేతి పంపులు



గొడుకొండ్లలో మరమ్మతుకు నోచని చేతిపంపు

గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి కొన్నేళ్ల క్రితం చింతపల్లి మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం 250 చేతిపంపులను ఏర్పాటు చేసింది. అందులో సుమారు 40 చేతి పంపులు మాత్ర మే పనిచేస్తున్నాయి. వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీ అధికారులపై ఉంచింది. అయితే నిధులు సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వేసవి కావడంతో బోరుబావుల్లో నీరు లేకపోవడంతో ప్రజ లకు నీటి కష్టాలు తప్పడం లేదు. మరమ్మతులకు గురైన చేతి పంపులను గుర్తించి వాటిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి- చింతపల్లి)

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



వెంకటయ్యను సన్మానిస్తున్న మాజీఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడితండాలో శుక్రవారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి పాల శీతలీకరణ కేంద్రంలో ఆయనకు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి : ఏడీఏ

చింతపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలని ఏడీఏ శ్రీలక్ష్మి సూచించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎరువులు, విత్తనాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో డీలర్లు అందుబాటులో ఉంచి రైతులకు సకాలంలో అందించాలన్నారు. విక్రయించిన ఎరువులు, విత్తనాల సంఖ్యను రికార్డులో పొందుపర్చాలన్నారు. ని బంధనలకు విరుద్ధంగా దుకాణంలో నకిలీ విత్తనాలు, ఎరువులు నిల్వ ఉంచి విక్రయిస్తే వెంటనే లైసెన్స్ రద్దు చేసి దుకాణం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో చింతపల్లి, దేవరకొండ ఏవోలు శ్రావణికుమారి, రవికుమార్, ఏఈవోలు మౌనిక, ప్రియాంక, డీలర్లు యాదయ్య, వెంకటయ్య, ప్రసాద్, శ్రీశైలం పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉన్నత కొలువులు

● మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్



సౌమ్యశ్రీని అభినందిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్లు భార్గవ్, నాగలక్ష్మీ

మిర్యాలగూడ టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): కష్టపడితేనే ఉన్నత కొలువులు సాధించవొచ్చని మునిసిపల్ మాజీ చైర్మన్లు తిరునగరు భార్గవ్, నాగలక్ష్మి అన్నారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన సన్నిధి సౌమ్యశ్రీ సీబీఐ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. దీంతో ఆమెను వారు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సీబీఐ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడం గొప్ప విషయమన్నారు. సౌమ్యశ్రీని ప్రోత్సహించిన తల్లిదండ్రులు సన్నిధి కోటయ్య, సునీతను ప్రత్యేకంగా అభినందించారు.

27.4తులాల బంగారు ఆభరణాలు చోరీ

● దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టిన ముసుగుదొంగలు



నగల దుకాణంలో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

దామరచర్ల, మే 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ నగల దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండల కేంద్రంలోని విజయశ్రీ జ్యూయలరీ దుకాణం నిర్వాహకుడు కాశె బ్రహ్మయ్య గురువారం రాత్రి 9 గంటలకు దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున 2.15 గంటలకు మెలకువ రావడంతో తన స్మార్ట్‌ఫోన్ నుంచి దుకాణం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను పరిశీలించి అన్ని వస్తువులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించాడు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో మొబైల్‌లోని సీసీ కెమెరాలను ఆన్ చేసేందుకు ప్రయత్నించగా కనెక్ట్ కావడం లేదు. దీంతో అనుమానంతో వెంటనే ఇంటివద్ద నుంచి అర కిలోమీటరు దూరంలో ఉన్న దుకాణం వద్దకు ఉదయం 4 గంటల సమయంలో వచ్చి చూడగా రాళ్లతో షట్టర్ తాళాలు పగుల గొట్టి ఉండడాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడగా బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. మొత్తం 27.4 తులాల వివిధ రకాల ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. చోరీకి పాల్పడిన ముసుగులు ధరించిన దొంగలు తొలుత సీసీ కెమెరా వైర్లను తొలగించి, బంగారు ఆభరణాలతోపాటు సీసీ కెమెరాకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. నల్లగొండ నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించింది. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నగల దుకాణంలో చోరీ జరిగిన ప్రాంతాన్ని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రూరల్ సీఐ పీఎండీ.ప్రసాద్ ఉన్నారు.

బియ్యపు గింజలపై 'ఓం నమో నరసింహాయ నమః'

● 77రోజుల దీక్షతో 32వేల కల్యాణ తలంబ్రాలు సిద్ధం ● మిర్యాలగూడకు చెందిన భక్తురాలి ప్రతిభ





బియ్యం గింజలపై రాసిన 'ఓం నమో నరసింహాయ అక్షరాలు, బియ్యం గింజలపై స్వామివారి నామాన్ని లిఖిస్తున్న గేయవర్షిణి

మిర్యాలగూడ అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): తన ఇష్టదైవం నరసింహస్వామిని తలుచుకుంటూ ఓ భక్తురాలు 'ఓం నమో నరసింహాయ నమః' అనే జప మంత్రాన్ని బియ్యం గింజలపై లిఖిస్తోంది. మిర్యాలగూడ పట్టణం గుంటూరు శ్రీనివాస్, లక్ష్మి దంపతుల కుమార్తె గేయవర్షిణి తనకున్న సూక్ష్మచేతిరాత ప్రావీణ్యానికి భక్తి పారవశ్యం జోడించి 77రోజుల కఠోర దీక్షతో స్వామివారి జపమంత్రాన్ని భక్తిశ్రద్ధలతో రాస్తోంది. ఈ నెల 11న సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి తలంబ్రాలుగా సమర్పించేందుకు 32,116 బియ్యం గింజలపై 13 అక్షరాలతో జప మంత్రాన్ని లిఖిస్తోంది. సాధారణ జెల్ పెన్నుతో స్వామివారి నామాన్ని బియ్యం గింజలపై లిఖించే ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు గేయవర్షిణి తెలిపారు. 2005లో గేయవర్షిణి తండ్రి శ్రీనివాస్ బియ్యం గింజలపై సూక్ష్మఅక్షరాలు రాసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తాను సాధించలేని లక్ష్యాన్ని తన కుమార్తెతో పూర్తిచేయడంతో శ్రీనివాస్ ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గేయవర్షిని సూక్ష్మచేతిరాతపై ఆసక్తి పెంచుకుని తొలిప్రయత్నంలోనే జగిత్యాల జిల్లా ధర్మపురి నరసింహ ఆలయంలో 'శ్రీ నరసింహ' అనే ఆరు అక్షరాలను 12,116 బియ్యం గింజలపై లిఖించి తలంబ్రాలుగా స్వామివారికి సమర్పించారు. ఆమెలోని ప్రతిభను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ మైక్రో హ్యాండ్ రైటింగ్ అవార్డుకు గేయవర్షిణిని ఎంపిక చేయడంతో 2024 డిసెంబర్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా ఢిల్లీలోని శాస్త్రీ భవన్‌లో అవార్డు అందుకున్నారు. గత ఏడాది వాడపల్లి నర్సింహస్వామి ఆలయానికి 12,116 బియ్యం గింజలపై స్వామివారి నామాన్ని లిఖించి తలంబ్రాలుగా సమర్పించింది. తాజాగా మట్టపల్లి ఆలయంలో జరిగే లక్ష్మీనృసింహుడి కల్యాణ మహోత్సవానికి స్వామివారి నామాన్ని రచించిన 32,116 బియ్యం గింజలను తలంబ్రాలుగా అందజేసేందుకు మౌనదీక్షతో భక్తి కార్యాచరణ పూర్తిచేస్తున్నట్లు గేయవర్షిణి తెలిపారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత

తిరుమలగిరి(సాగర్), మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుమీదితండాకు చెందిన అంగోతు సుశీల దివ్యాంగురాలు కావడంతో నిత్యం దైనందిన పనులను చేసుకోవడానికి ఇబ్బందులు పడుతుంది. దీంతో స్థానికుల ద్వారా తెలుసుకున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ అనిల్‌కుమార్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో అనిల్‌నాయక్, హరినాయక్, తుమ్మరగోటి రమేష్, సాయి నాయక్, చందునాయక్, సేవానాయక్, నరేష్‌నాయక్, మన్నెం కోటి, రావుల రాము, మేకల శివ, గంగుల అంజి, శేఖర్‌గౌడ్, పోలెపల్లి శివ తదితరులు ఉన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా
నెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

నాగార్జునసాగర్, మే9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్‌బాల్ సబ్ జూనియర్ అండర్-16 బాల, బాలికల జట్ల ఎంపిక శుక్రవారం సాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు నెట్‌బాల్ అసోషియేషన్ జిల్లా సెక్రటరీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎంపిక కార్యక్రమానికి మొత్తం 80మంది క్రీడాకారులు హాజరుకాగా, 26మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఎంపికైన బాల, బాలికల జట్లు

బాలికల జట్టు: సుష్మవిరాజ్, ఎండీ సభానూర్, బి.కీర్తన, బి.మహేశ్వరి, ఎస్‌కే రిజ్వానా, బి.కరుణ, ఎస్‌కే మేహక్, ఏ.దీక్షిత, ఆర్.సింధు, ఏ.ఐశ్వర్య, పూజ, సింధు

బాలుర జట్టు: పృథ్వీరాజ్, వెంకటసాయి, నిఖిలేష్, నజీర్, మధు, చైతన్య, సత్యసాయి, కళ్యాణ్, సాత్విక్, కమల్ తేజ్, కృష్ణ, బాలు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18 తేదీల్లో జనగాం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

డ్యాన్స్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవిలో నెల రోజులపాటు చిన్నారులు, యువతకు నిర్వహిస్తున్న ఉచిత డ్యాన్స్ శిక్షణ తరగతులు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు (ఎన్‌వీటీ) తెలిపారు. అసోసియేషన్ భవనంలో డ్యాన్స్ తరగతులు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ గౌడ్, కృష్ణకిషోర్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, భాస్కర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులను సన్మానించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. ప్రభుత్వ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఇటీవల వెలువడిన పరీక్ష ఫలితాల్లో కేతావత్ అఖిల ఇంటర్ సెకండియర్‌లో 996, కృష్ణవేణి మొదటి సంవత్సరంలో 467 అత్యధిక మార్కులు సాధించారు. దీంతో వారిని దేవరకొండ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి మాట్లాడారు. ప్రభుత్వ గురుకులాలు, రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రభుత్వం నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందన్నారు. దీంతోపాటు గురుకులాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా గురుకులాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆలనా, పాలనా ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. కార్యక్రమంలో చందంపేట మాజీ జడ్పీటీసీ లచ్చిరాంనాయక్, పాపనాయక్, కొర్ర రాంసింగ్, సీత్యానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా,మే 9(ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హాలియాలోని క్యాంప్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వారి వృత్తికి ఉపయోగపడే విధంగా చెట్టుపైకి సులభంగా ఎక్కడానికి, ప్రమాదాల బారిన పడకుండా ఉండే విధంగా కిట్ల పంపిణీ చేస్తోందని కల్లుగీత కార్మికులందరికీ ఈ కిట్ల పంపిణీ ఉంటుందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఎంపిక చేసిన కల్లుగీత కార్మికులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కల్పన, పీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంసాని చంద్రశేఖర్, అంకతి సత్యం, యడవల్లి వల్లపురెడ్డి, శివమారయ్య, విజయ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

తిరుమలగిరి(సాగర్), మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతిచెందింది. తండాకు చెందిన దెపావత్ బాలు అనే రైతు తనకున్న ఆవును మేత కోసం పొలాల వైపు వదిలిపెట్టగా మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని ఉన్న విద్యుత్ వైర్‌కు ఆవు తాకడంతో విద్యుదాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ప్రజల సహకారంతో పట్టణాభివృద్ధి

● మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో మాట్లాడుతూ సకాలంలో ఆస్తి, నల్లా పన్నులు చెల్లించాలన్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి వెలువడే వ్యర్థాలను తడి, పొడిగా వేరే చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. కూడళ్లు, ఖాళీ ప్లాట్లలో వ్యర్థాలు వేయరాదన్నారు. సమస్యలుంటే కార్యాలయంలో తెలియజేయాలన్నారు. పలు వార్డులలో కుక్కల బెడద అధికంగా ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో స్వతంత్ర సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని 28, 43 వార్డులలో కుక్కలను పట్టించామన్నారు. జంతు నియంత్రణ నిబంధనల మేరకు సుశిక్షితులైన సిబ్బంది కుక్కలు పట్టి వ్యాన్‌తో తరలించారన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, శ్వేత తదితరులు ఉన్నారు.

నిరంతరంగా విద్యుత్ సరఫరా

శరత్‌కుమార్‌చారి, విద్యుత్ ఏఈ



ఇంటర్వ్యూ Interview

వేసవిలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని నిడమనూరు విద్యుత్ ఏఈ శరత్‌కుమార్‌చారి తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. విద్యుత్ కోతలు, కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర విషయాలు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. (నిడమనూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారా?

ఏఈ: ఎలాంటి విద్యుత్ కోతలు లేవు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఎల్‌సీ తీసుకున్నప్పుడు మాత్రమే కొద్దిసేపు అంతరాయం కలుగుతుంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి?

ఏఈ: నిడమనూరు, ముప్పారం, గుంటిపల్లి, రేగులగడ్డ గ్రామాల్లో సబ్ స్టేషన్లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎక్కడైనా కొత్త సబ్ స్టేషన్ల నిర్మిస్తున్నారా?

ఏఈ: వేంపాడ్ గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మిస్తున్నాం. త్వరలో ప్రారంభిస్తాం విద్యుత్ సమస్యలకు చెక్ పడుతుంది. ఎర్రబెల్లి, తుమ్మడం గ్రామంలో కూడా సబ్ స్టేషన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం

ఆంధ్రజ్యోతి: మండలంలో గృహజ్యోతి పథకానికి ఎందరుఅర్హులయ్యారు?

ఏఈ: మండలంలో 7,200 మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారా?

ఏఈ: అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాము. నూతనంగా ఆరు 100 కేవీ, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 48 ఏర్పాటు చేస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: మండలంలో లో వోల్టేజీ సమస్య ఉందా?

ఏఈ: మండలంలోని గ్రామాల్లో విద్యుత్ లో వోల్టేజీ సమస్య లేదు. సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం..

ఆంధ్రజ్యోతి: వినియోగదారులకు ఏమైనా సలహాలు ఇస్తున్నారా?

ఏఈ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు బిల్లులు, బకాయిలు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి దోహదం చేయాలి.వినియోగ దారులు సహకరించాలి.